Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered
with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారం

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 187 విశాఖపట్నం, 7 మే 2025 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

విలేఖరులు కావలెను
రాజమండ్రి, చాగల్లు,
నిడదవోలు,
దేవరపల్లి మండలాలకు
విలేకరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్ : 9100986584, 9553574250

## అన్ని ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానం



**ఏపీ సీఎం చంద్రబాబు నిర్ణయం**



**అమరావతి, విశాఖ సమాచారం :** ఏపీలోని అన్ని ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానం ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దేవాదాయ శాఖ పై ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 23 ప్రధాన ఆలయాలు ఉండగా, వాటిలో శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, బెజవాడ దుర్గమ్మ, అన్నవరం, ద్వారకా తిరుమల, సింహాచలం ఇలా 7 ఆలయాల్లో మాత్రమే నిత్యాన్నదానం జరుగుతోందని తెలిపారు. మిగిలిన 16 ఆలయాల్లో కూడా భక్తులకు అన్నదాన పథకం అమలు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదం రుచి, నాణ్యత, పరిశుభ్రత ఉండే విధంగా భక్తులకు పవిత్ర భావన కలిగేలా అందించాలని సూచించారు. ఇందుకోసం వాలంటీర్‌గా వచ్చేవారి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అన్నప్రసాద కార్యక్రమానికి ఆదాయం సరిపోని దేవాలయాలకు 7 ప్రధాన ఆలయాలు నుంచి నిధులు సమకూర్చేలా ...(మిగతా 2లో)

## గ్రామీణ యువతకు వరం ఎంఎస్ఎంఈ పార్క్



**కృష్ణాపురంలో శంకుస్థాపన చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**రూ.100 కోట్ల విలువైన పరిశ్రమలకు అవకాశం**

**పద్మనాభం, విశాఖ సమాచారం:** విశాఖ జిల్లా పద్మనాభం మండలం కృష్ణాపురంలో ఎంఎస్ఎంఈ పార్క్ కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో శంకుస్థాపన చేస్తున్న మొదటి ఎంఎస్ఎంఈ పార్క్ భవిష్యత్ లో ఆంధ్రప్రదేశ్‌కు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యావంతులైన గ్రామీణ యువత ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంఎస్ఎంఈ పార్క్ ల ఆలోచన చేశారని చెప్పారు. కృష్ణాపురం ఎంఎస్ఎంఈ పార్క్ లో రూ.100 కోట్ల విలువైన పరిశ్రమలు ఏర్పాటవుతాయని, రూ. 12.40 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. మొదటి దశలో 22 ఎకరాల్లో 163 ప్లాట్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ కూటమి ప్రభుత్వ విధానమని, రాబోయే రెండేళ్లలో ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ఈ పార్క్ ల వల్ల ఉత్తరాంధ్రలో ఉపాధి వలసలు తగ్గుతాయన్నారు. భీమిలి నియోజకవర్గంలో అభివృద్ధికి విశేష అవకాశాలున్నాయని, తర్లువాడలో గూగుల్ కంపెనీ కోసం 200 ఎకరాలు సేకరిస్తున్నామని వెల్లడిరచారు.

**ఇనాం రైతులకు ప్రభుత్వ పథకాలు**

నియోజకవర్గంలో ఉన్న ఏడు ఇనాం గ్రామాల్లో రైతులకు పూర్తి ...(మిగతా 2లో)

## ఉక్కు ఉద్యమానికి కాంగ్రెస్ మద్దతు

**తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోకుంటే ఆమరణ దీక్ష**

**వైఎస్ షర్మిల హెచ్చరిక**



**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** విశాఖ ఉక్కు కార్మికుల పోరాటానికి మద్దతుగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిరాహార దీక్ష చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేపట్టిన దీక్ష మంగళవారానికి 1545 రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో వైఎస్ షర్మిల ఆందోళన చేస్తున్న కార్మికుల వద్దకు వచ్చి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉక్కు కార్మికుల పోరాటానికి కాంగ్రెస్ ...(మిగతా 2లో)



## ఏపీ డ్వాక్రా మహిళలకు రూ.8 వేల కోట్ల రుణాలు

**అమరావతి, విశాఖ సమాచారం:** ఏపీలోని డ్రాక్వా మహిళలకు భారీగా రుణాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు 8 వేల కోట్ల రూపాయల రుణాలను ఏపీ మహిళలకు అందించేలా... ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఏపీ మంత్రి నారాయణ వెల్లడిరచరు. 2047 సంవత్సరం నాటికి ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త ఉండాలని లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన మెప్మా కార్యక్రమంలో మెప్మా వెబ్ సైట్ ను మంత్రి లాంచ్ చేశారు. ...(మిగతా 2లో)

## నేటి నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ



**-మంత్రి నాదెండ్ల**

**అమరావతి, విశాఖ సమాచారం:** రాష్ట్రంలో మే 7నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొత్త కార్డులు జారీ, రేషన్‌కార్డు స్ప్లిట్, కొత్త సభ్యుల చేరిక, చిరునామా మార్పులు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రేషన్‌కార్డుల్లో మార్పుల కోసం 3.28లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డును జారీ చేస్తామని చెప్పారు. ఇందులో కుటుంబసభ్యుల పేర్లు చక్కగా కనిపించేలా ఉంటుందన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే గడిచిన ఆరు నెలలుగా తీసుకున్న రేషన్ వివరాలు కనిపిస్తాయని చెప్పారు. “దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఈ కార్డు వెసులుబాటు కల్పిస్తుంది. నెలరోజులపాటు ఈ రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి పౌరులు తమ వివరాలు తెలుసుకోవచ్చు. జూన్ నుంచే స్మార్ట్ కార్డులు జారీ అవుతాయి. ప్రస్తుతం 95 శాతం మేర ఈ కేవైసీ పూర్తి అయింది. ఈకేవైసీ పూర్తి అయిన వారు ...(మిగతా 2లో)

## క్రీడలపై యువత దృష్టి



**హెూం మంత్రి అనిత పిలుపు**

**నక్కపల్లిలో మినీ హాకీ గ్రౌండ్ ప్రారంభం**

**నక్కపల్లి, విశాఖ సమాచారం:** చదువుతో పాటు క్రీడలపై కూడా యువత మక్కువ చూపాలని రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హాకీ మిని గ్రౌండ్‌ను హెూం మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఆస్ట్రోటర్ఫ్‌తో రూ. 1.6 కోట్ల వ్యయంతో మైదానం నిర్మించారు. ముందుగా మంత్రి అనిత, హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మైదానంలో క్రీడాకారులతో కలిసి హాకీ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హాకీ గ్రౌండ్‌లో వాటర్, కరెంట్ సమస్యలను తక్షణమే పరిష్కరించామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసిన కోచ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. పోలీస్ విభాగంలో పనిచేస్తూనే క్రీడాకారులను తయారుచేస్తున్న సూరిబాబు స్ఫూర్తిదాయకమని అభినందించారు. నక్కపల్లిలో హాకీ కోర్టు ఏర్పాటు చాలా సంతోషకరమని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ధృఢంగా ఉంటారని, సమస్యలతో ధైర్యంగా ఎదుర్కోగల శక్తి వారి వద్ద ఉంటుందని చెప్పారు. తల్లిదండ్రులు ఆవిధంగా పిల్లలను తీర్చిదిద్దాలని ఆమె అన్నారు. నక్కపల్లికి చెందిన 30 మంది క్రీడాకారులు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో నక్కపల్లి ‘హాకీ నక్కపల్లి’గా పేరు తెచ్చుకోవచ్చనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాయకరావుపేటలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, స్టేడియం ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం చొరవతో ...(మిగతా 2లో)

## పోరాడండి.. వనరులిస్తాం..



**భారత్‌కు అమెరికా హామీ**

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేసే పోరాటానికి తాము అండగా ఉంటామని అమెరికా మరోసారి హామీ ఇచ్చింది. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తాజా పరిణామాల వేళ అమెరికా కీలక ప్రకటన చేసింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా న్యూదిల్లీ చేసే పోరాటానికి తాము అండగా ఉంటామని పునరుద్ఘాటించింది. ఈ మేరకు అగ్రరాజ్యం అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ వెల్లడించారు. “ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ బలంగా నిలబడాలి. అందుకోసం న్యూదిల్లీ చేసే అన్ని ప్రయత్నాలకు మేం మద్దతు అందిస్తాం. ఉగ్రవాదంపై పోరాటం కోసం భారత్‌కు శక్తివనరులతో సహకారం అందిస్తాం. ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఇది కూడా భాగమే. భారత్‌తో బంధం ఎంత ముఖ్యమో ట్రంప్ ...(మిగతా 2లో)



## రిజర్వేషన్ రైలుబోగీ లాంటిది!

**సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

**దిల్లీ:** రిజర్వేషన్లను ఉద్దేశించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోని కుల ఆధారిత రిజర్వేషన్లు రైలు బోగీల్లాంటివని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఆ కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన వ్యక్తులు ఇతరులను లోపలికి రానివ్వరని పేర్కొంది. మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లపై వేసిన పిటిషన్ విచారణలో భాగంగా సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈవిధంగా స్పందించారు. మహారాష్ట్రలో 2016-17లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఓబీసీ కోటా విషయంలో జరుగుతోన్న న్యాయపోరాటంలో ఎన్నికల ...(మిగతా 2లో)

## ఉగ్రదాడిపై సమాచారమున్నా ఎందుకు భద్రత కల్పించలేదు?



**కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ధ్వజం**

**రాంచి:** పహల్గాం ఉగ్రదాడి వ్యవహారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. పహల్గాంలో మరింత భద్రత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. ‘సంవిధాన్ బచావో’ పేరుతో రాంచీ వేదికగా నిర్వహించిన సభలో ఖర్గే ఈ విధంగా స్పందించారు. “దేశంలో పరిస్థితుల గురించి మీ అందరికీ తెలుసు. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించి నిఘా వైఫల్యం ఉందని ప్రభుత్వం అంగీకరించింది. ఇంటెలిజెన్స్‌ను పటిష్ఠ పరచుకుంటామని వాళ్లే చెప్పారు. దాడికి మూడు రోజుల ముందే నిఘా సమాచారం ఉందని నాకు తెలిసింది. అలాంటప్పుడు అక్కడ (పహల్గాంలో) తగినంత భద్రతా ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నా ” అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఏదేమైనా పహల్గాం దాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌పై ఎటువంటి చర్య తీసుకున్నా ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని మల్లికార్జున ఖర్గే మరోసారి స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా దేశమే తొలి ప్రాధాన్యమన్నారు. రాజకీయ విభేదాలకంటే జాతీయ ఐక్యతే ముఖ్యమన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేసిన ఖర్గే.. ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడమే మోదీ విధానమని ఆరోపించారు. ఆదివాసీ నేతలను భయపెట్టే ధోరణిని అవలంబించకూడదని కేంద్రానికి సూచించారు.

# మాస్కోలో విమానాశ్రయాల మూసివేత

## 100 డ్రోన్‌లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్



**మాస్కో:** యుద్ధం ముగించేందుకు ఓవైపు అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ రష్యా-ఉక్రెయిన్ పరస్పర దాడులు కొనసాగిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా భారీస్థాయిలో విరుచుకుపడడంతో..కీవ్ పెద్ద ఎత్తున ప్రతీకార దాడులు చేస్తోంది. తాజాగా ఉక్రెయిన్ 100కు పైగా డ్రోన్లతో మాస్కోలోని డజనుకు పైగా ప్రాంతాలపై విరుచుకుపడింది. అయితే పలు డ్రోన్లను తాము సమర్థవంతంగా కూల్చేసినట్లు రష్యా పేర్కొంది. డ్రోన్ దాడుల కారణంగా మాస్కోకు సమీపంలోని 4 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మాస్కోలోని ప్రధాన ప్రాంతాల్లో ఉక్రెయిన్ దాడుల వల్ల మరో తొమ్మిది ప్రాంతీయ విమానాశ్రయాలు కూడా స్వల్పంగా ధ్వంసమయ్యాయని..దీంతో వాటిని మూసేయాల్సి వచ్చిందని రష్యా పౌర విమానయాన సంస్థ రోసావియాట్సియా వెల్లడించింది. మరోవైపు రష్యా సరిహద్దు వద్ద ఉన్న ఉక్రెయిన్‌లోని ఖార్కివ్ నగరంపై రష్యా దళాలు 20కి పైగా డ్రోన్లను ప్రయోగించాయి. ఈ దాడిలో నలుగురు గాయపడగా.. దాదాపు 100 మార్కెట్ స్టాళ్లు ధ్వంసమయ్యాయి. మరో ప్రాంతంలో మాస్కో బాంబులు ప్రయోగించిన ఘటనలో ఏడుగురు పౌరులు గాయపడినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. రెండో ప్రపంచయుద్ధ విజయానికి 80వ వార్షికోత్సవం 'విక్టరీ డే' సందర్భంగా మే 8 నుంచి 10 వరకు మూడు రోజులపాటు రష్యా.. ఉక్రెయిన్‌పై పోరు విరమణను ప్రకటించింది. వాటికన్‌లో పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు హాజరైన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ అయి.. శాంతి ఒప్పంద చర్చలు జరిపిన విషయం తెలిసిందే. అనంతరం మాస్కో తన నిర్ణయాన్ని వెలువరించింది. ప్రపంచ దేశాల నేతలు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 'విక్టరీ డే'కు ముఖ్య అతిథి అని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల పేర్కొన్నారు.

# శ్రీవారి మెట్టు మార్గంలో మరిన్ని సౌకర్యాలు

## టీటీడీ ఈవో శ్యామలరావు



**తిరుమల, విశాఖ సమాచారం:** తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తులకు శ్రీవారి మెట్టు మార్గంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవో జె. శ్యామలరావు తెలిపారు. కాలినడకన వెళ్లే మార్గంలో టోకెన్లు పొందేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో.. అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి. వీరబ్రహ్మంతో కలిసి మంగళవారం కాలినడక మార్గంలో పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ.. శ్రీవారి మెట్టు మార్గంలో దర్శనానికి సంబంధించి టోకెన్లు పొందడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఆటోవాలాల నుంచి సరైన సహకారం లేదనే విషయం బోర్డు దృష్టికి వచ్చిందన్నారు. టీటీడీ కల్పిస్తోన్న సౌకర్యాలను ఆటోవాలాలు తమ స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారని, భక్తుల నుంచి విచ్చలవిడిగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు. శ్రీవారి మెట్టు మార్గంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమీక్షించి.. మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తిరుపతి నుంచి శ్రీవారి మెట్టు మార్గం వరకు బస్సుల సంఖ్య పెంచడం, టోకెన్ల జారీ కౌంటర్లను పెంచే అంశాలను పరిశీలిస్తామన్నారు. భక్తుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

# గ్రామీణ యువతకు వరం ఎంఎస్ఎంఈ పార్క్



(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్య హక్కులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పగా.. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పందించారు. మూడు గ్రామాల్లో దీనికి సంబంధించిన రికార్డ్ పనులు పూర్తయ్యాయని, తొందర్లోనే రైతులందరికీ పాస్ బుక్ లు మంజూరు చేస్తామని ప్రకటించారు. యువ నాయకుడు గంటా రవితేజ, ఆర్డీఓ కె. సంగీత్ మాధుర్, పద్మనాభం మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ రమణ, ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### కూలిన స్టేజ్


కార్యక్రమం చివర్లో ఎక్కువమంది ఎక్కడంతో స్టేజ్ కూలిపోయింది. అయితే ముందుగానే అప్రమత్తమైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరుల వ్యక్తిగత భద్రతా సిబ్బంది వారిని సురక్షితంగా స్టేజ్ నుంచి కిందకు తీసుకు రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నాడు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

### పాండ్రంగి బ్రిడ్జి పనుల పరిశీలన

అనేక ఏళ్లుగా పెండిరగ్ లో ఉన్న పాండ్రంగి బ్రిడ్జి పనుల ప్రగతిని గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేసి బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. 6 నుంచి 9 నెలల్లో బ్రిడ్జి పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించుకున్నామని తెలిపారు.

# క్యామ్‌సైన్ డైరెక్టర్ ధాత్రి మధు అరెస్టు

## ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమాల కేసు




**హైదరాబాద్, విశాఖ సమాచారం:** ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమాల కేసులో 'క్యామ్‌సైన్ మీడియా' సంస్థ డైరెక్టర్ ధాత్రి మధును పోలీసులు అరెస్టు చేశారు. గ్రూప్-1 మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడ్డారని అతడిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో హైదరాబాద్‌లోని అతడి కార్యాలయంలో మధును ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విజయవాడకు తరలిస్తున్నారు.

మూల్యాంకన కుంభకోణం కేసులో మధును ఏ2గా కోర్టులో పోలీసులు హాజరుపరచనున్నారు. హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మూల్యాంకన నిర్వహణ బాధ్యతలను నిబంధనలకు విరుద్ధంగా కొటేషన్ విధానంలో పొందిన క్యామ్‌సైన్ సంస్థ.. ఇతర విషయాల్లోనూ అవకతవకలకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ కుంభకోణంపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసుస్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌లో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులను ఏ1గా చేర్చిన విషయం తెలిసిందే.

# నేటి నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ నెల 12 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం"అని తెలిపారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులందరికీ పంట నష్ట పరిహారం అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు 1.50 కోట్ల మందికి దీపం పథకం ద్వారా లబ్ధి కలిగిందన్నారు. పాఠశాలలకు 25 కేజీల ఫైన్ క్వాలిటీ రైస్ ఈ ఏడాది నుంచి సరఫరా చేయబోతున్నామని వెల్లడించారు.

# అన్ని ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానం



(మొదటి పేజీ తరువాయి)

చూడాలని సూచించారు. తిరుమల వెంగమాంబ అన్నప్రసాద తరహాలో నిబంధనలు పాటించాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేనట్లుగా రాష్ట్రంలో అన్నప్రసాద వితరణ జరగాలి. ప్రసాదాల నాణ్యతపై దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. ఆయా ఆలయాల ప్రసాదాల విశిష్టత కొనసాగేలా చూడాలి. నాణ్యత పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహించాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ఏపీ డ్వాక్రా మహిళలకు రూ.8 వేల కోట్ల రుణాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇకముందు 80 వేల డ్రాక్వా సంఘాలకు దాదాపు 8 వేల కోట్ల రూపాయల రుణాలు ఇవ్వబోతున్నట్లు వివరించారు. ప్రస్తుతం 13 జిల్లాలలో మాత్రమే మెప్మా పీడీలు ఉన్నట్లు వివరించారు. వాటిని మొత్తం 26 జిల్లాలకు పెంచబోతున్నట్లు చెప్పారు. ఏపీ మహిళలు గర్వంగా బతికేలా కార్యక్రమాలు చేపడతామని మంత్రి తెలిపారు.

# క్రీడలపై యువత దృష్టి



(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్ కూడా రాబోతుందని వెల్లడిరచారు. ఈ సందర్భంగా మంత్రి అనిత హాకీ కోచ్‌లను సత్కరించారు. ఉపమాక సర్పంచ్ చిన్న ఆత్మశాంతికి మంత్రి శ్రద్ధాంజలి ఘటించారు.

# పోరాడండి.. వనరులిస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

యంత్రాంగం అర్థం చేసుకుంది. ఉగ్రవాదం నుంచి ఎదురయ్యే ముప్పు ఎలాంటిదో కూడా మాకు తెలుసు" అని మైక్ జాన్సన్ వివరించారు. ఈ విషయంలో గతంలోనూ అగ్రరాజ్యం భారత్‌కు మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్ ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ట్రంప్.. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారికి శిక్ష పడేలా తీసుకునే చర్యలకు సహకారం అందిస్తామన్నారు. ఉగ్రవాద పోరులో ఇరుదేశాలు కలిసి పోరాడుతాయని అగ్రరాజ్యాధినేత తెలిపారు. పహల్గాం దాడికి పాల్పడినవారిని కలలో కూడా ఊహించనివిధంగా శిక్షిస్తామని ఇప్పటికే ప్రధాని మోదీ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దిశగా కేంద్రం కీలక నిర్ణయాలకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలు కన్పిస్తున్నాయి. అన్ని రాష్ట్రాల్లో యుద్ధ అప్రమత్తతకు కేంద్రం పిలుపునివ్వడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. గగనతల దాడుల గురించి హెచ్చరించే సైరన్ల వ్యవస్థ పనిచేసేలా చూడాలని, ఇతరత్రా స్వీయరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్ర హోంశాఖ సోమవారం అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. దీనిపై నేడు సమీక్ష కూడా చేపట్టారు.

# ఉక్కు ఉద్యమానికి కాంగ్రెస్ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. 2021 జనవరిలో ప్రైవేటీకరణ అంటూ నిర్ణయం తీసుకున్నారని.. దీంతో అప్పటి నుంచి ఉద్యమం కొనసాగుతూనే ఉందని ఆమె పేర్కొన్నారు. బీజేపీ హయంలోనే స్టీల్ ప్లాంట్‌కి కష్టాలు మొదలు అయ్యాయని విమర్శించారు. అదానీకి మేలు చేసేందుకు స్టీల్ ప్లాంట్‌ను చంపేస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు కాంగ్రెస్ హయంలో విశాఖ స్టీల్ ప్లాంట్ నెలకొల్పబడిరది. గత 6 నెలలుగా కార్మికులను తొలగించే ప్రక్రియ సాగుతోంది. కాంగ్రెస్ హయంలో ప్లాంట్ లో 34 వేల మంది ఉద్యోగులు ఉండే వాళ్ళు.. ఈ 11 ఏళ్లలో కారణం లేకుండా ఉద్యోగులను తొలగించారని ఆమె మండిపడ్డారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను సైతం తొలగించడంతో.. ఇప్పుడు ప్లాంట్‌లో 20 వేల ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. ఈ మధ్య 15 వందల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారు. స్టీల్ ప్లాంట్ లో తొలగించిన 2 వేల మందిని వెంటనే విధుల్లో తీసుకోవాలని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆమె డిమాండ్ చేశారు. ఇంకో 3 వేల మందిని తొలగించాలని కుట్ర చేస్తున్నారు. ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆమె కోరారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలి. స్టీల్ ప్లాంట్ ను సెయిల్‌లో విలీనం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో కార్మికులు ఇంత అవస్థలు పడుతుంటే.. మీది గుండెనా? బండనా? అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 20 నుంచి తలపెట్టిన సమ్మెకు కాంగ్రెస్ మద్దతిస్తుందని తెలిపారు. కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే 21వ తేదీన ఇదే స్టీల్ ప్లాంట్ వద్ద ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని షర్మిల హెచ్చరించారు.

# మాట మార్చిన భుట్టో!

## భారత్‌తో 'శాంతి'ని కోరుకుంటున్నాం



**ఇస్లామాబాద్:** శాంతి చర్చలకు పాకిస్థాన్ సిద్ధంగానే ఉందని విదేశాంగ మాజీ మంత్రి బిలావల్ భుట్టో పేర్కొన్నాడు. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తూ భారత్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దానిపై మొదట్లో నోరు పారేసుకున్న పాకిస్థాన్ విదేశాంగ మాజీ మంత్రి బిలావల్ భుట్టో సింధూనదిలో నీరు పారకుంటే రక్తం పారుతుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. తాజాగా ప్రతీకార చర్యలకు భారత్ సన్నద్ధమవుతున్న వేళ స్వరం మార్చిన ఆయన.. శాంతి చర్చలకు పాకిస్థాన్ సిద్ధంగానే ఉందని చెప్పాడు. అయితే, విధ్వంసం కావాలా? శాంతి కావాలో భారత్ నిర్ణయించుకోవాలంటూ మరోసారి విషం చిమ్మాడు. పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీలో పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ఛైర్మన్ బిలావల్ భుట్టో మాట్లాడుతూ.. "భారత్ శాంతి మార్గంలో వెళ్లాలని భావిస్తే.. పిడికిలి బిగించకుండా స్వేచ్ఛగా రానివ్వండి. కల్పితాలు కాకుండా వాస్తవాలతో రానివ్వండి. పొరుగువారిగా వారితో కూర్చొని నిజాలు మాట్లాడుదాం. అలా కాదనుకుంటే.. పాక్ ప్రజలను మోకరిల్లేలా చేయలేరని విషయాన్ని వారు గుర్తుంచుకోవాలి. పోరాటం చేసేందుకు పాక్ ప్రజలు సిద్ధమే. యుద్ధంపై ఇష్టంతో కాదు, స్వేచ్ఛపై ప్రేమతో మాత్రమే" అని బిలావల్ భుట్టో పేర్కొన్నాడు. ఉగ్రవాద సంస్థలకు మద్దతు, ఆర్థిక సాయం పాక్ అందించిందని పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలతో భుట్టో ఇటీవల ఏకీభవించాడు. ఉగ్రవాద సంస్థలతో పాకిస్థాన్‌కు సంబంధాలు నిజమేనని అంగీకరించాడు. అయితే, అది ముగిసిన అధ్యాయమని.. అది తమ చరిత్రలో ఒక దురదృష్ట భాగమంటూ పేర్కొన్నాడు. ఉగ్రవాదానికి పాక్ బాధిత దేశమని, దాన్ని ఎన్నడూ ప్రోత్సహించలేదన్నాడు.

### ఐరాసలో చుక్కెదురు..

మరోవైపు భారత్‌కు వ్యతిరేకంగా భద్రతా మండలిలో తీర్మానం చేయించాలన్న పాక్ యత్నాలు మరోసారి బెడిసికొట్టాయి. ఫలితంగా దాయాదికే సభ్య దేశాల నుంచి కఠిన ప్రశ్నలు ఎదురయ్యాయి. ఉగ్రదాడికి పాల్పడిన వారు జవాబుదారీగా ఉండాలని తేల్చిచెప్పాయి. పహల్గాం దాడిలో లష్కరే తోయిబా పాత్రను ప్రశ్నించాయి. అంతేకాదు.. మతం ఆధారంగా అమాయకులను చంపడంపై ఆందోళన వ్యక్తంచేశాయి. భారత్‌తో ద్వైపాక్షిక చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని పాకిస్థాన్‌కు చాలా దేశాలు సలహా ఇచ్చాయి.

# వెబ్‌సైట్‌లో సుప్రీం న్యాయమూర్తుల ఆస్తుల వివరాలు





**ఢిల్లీ:** సుప్రీంకోర్టులో ఉన్న 33 మంది న్యాయమూర్తులలో.. 21 మంది తమ ఆస్తుల వివరాలను న్యాయస్థానం వెబ్‌సైట్‌లో ఉంచింది. న్యాయవ్యవస్థలో పారదర్శకతను పెంపొందించే చర్యల్లో భాగంగా.. జడ్జీల ఆస్తుల వివరాలను సుప్రీంకోర్టు సోమవారం వెల్లడిరచిన విషయం తెలిసిందే. న్యాయమూర్తులు స్వయంగా అందజేసిన ఆస్తుల వివరాలను సర్వోన్నత న్యాయస్థానం తన వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వెల్లడిరచింది. దీని ప్రకారం వారి ఆస్తుల వివరాలు.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు రూ.55.75 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్, రూ.14,000 విలువైన షేర్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో రూ.1.06 కోట్లు, రూ.1.2 కోట్ల జనరల్ ప్రావిడెంట్ ఫండ్, రూ.29,625 ఎల్ఐసీ మనీ బ్యాక్ పాలసీ వార్షిక ప్రీమియం, దక్షిణ ఢిల్లీలో ఫ్లాట్, కామన్వెల్త్ గేమ్స్ విలేజ్‌లో 2,446 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఓ అపార్ట్‌మెంట్, హిమాచల్ ప్రదేశ్‌లోని డల్హౌసీలో ఇల్లు ఉన్నాయి. చరాస్తుల్లో 250 గ్రాముల బంగారం, 2 కిలోల వెండి, మారుతి స్విఫ్ట్ కారు ఉన్నాయి. తదుపరి సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బి.ఆర్.గవాయ్‌కి బ్యాంకులో రూ.19.63 లక్షల నగదు, రూ.5.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, మహారాష్ట్రలోని అమరావతిలో తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఇల్లు, ముంబయిలోని బాంద్రా, ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీల్లో అపార్ట్‌మెంట్‌లు, వ్యవసాయ భూములు ఉన్నాయి. ఆయన సతీమణి వద్ద రూ.29.70 లక్షల విలువైన ఆభరణాలు, రూ.61,320 నగదు డిపాజిట్ ఉన్నాయి. ఈ ఏడాది నవంబర్ 24న భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ సూర్యకాంత్‌కు చండీగఢ్‌లో ఒక ఇల్లు, పంచకులలో 13 ఎకరాల వ్యవసాయ భూమి, గురుగ్రామ్‌లో ఇంటిస్థలం, రూ.4.11 కోట్ల విలువైన స్థిర డిపాజిట్లు, 100 గ్రాముల విలువైన బంగారు ఆభరణాలు, మూడు విలువైన గడియారాలు ఉన్నాయి. జస్టిస్ కేవీ విశ్వనాథన్‌కు రూ.120 కోట్లకు పైగా పెట్టుబడులు, ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ డెవలప్‌మెంట్ ఏరియా, గుల్‌మోహర్ పార్క్‌లో పలు ఆస్తులు, తమిళనాడులోని కోయంబత్తూరులో ఒక అపార్ట్‌మెంట్ ఉన్నాయి. 2010-11 నుంచి 2024-25 వరకు ఉన్న రూ.91.47 కోట్లకు పైగా ఆదాయపు పన్ను వివరాలను ప్రకటించారు. వెబ్‌సైట్‌లో న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటనే కాకుండా హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియ, హైకోర్టు కొలీజియానికి అప్పగించిన బాధ్యతల వివరాలు సహా ఇతర సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు జడ్జిగా విధులు నిర్వహించిన జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో ఇటీవల భారీ మొత్తంలో నగదు లభ్యమైందన్న ఆరోపణలు న్యాయవ్యవస్థ విశ్వసనీయతపై అనుమానాలు రేపిన నేపథ్యంలో న్యాయమూర్తులు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# రిజర్వేషన్ రైలుబోగీ లాంటిది!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణలో జాప్యం చోటుచేసుకుంటోంది. ఓబీసీలకు 27 శాతం కోటాను అమలుచేయడం కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌ను 2021లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. కాగా.. ఓబీసీలకు సంబంధించిన డేటా ఉన్నప్పటికీ, దానిని ప్రభుత్వం ఉపయోగించడం లేదని తాజాగా పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన అధికారుల ద్వారా స్థానిక సంస్థలను ఏకపక్షంగా నడుపుతోందని ఆరోపించారు. రిజర్వేషన్ల ప్రయోజనాన్ని పొందేందుకు ఓబీసీలలోనే వెనకబడిన వారిని గుర్తించాలని మరో న్యాయవాది తన వాదనను వినిపించారు. ఈ క్రమంలోనే న్యాయమూర్తి స్పందించారు. "దేశంలో రిజర్వేషన్లు రైలు కంపార్ట్‌మెంట్ల మాదిరిగా మారాయి. అందులోకి ప్రవేశించిన వ్యక్తులు ఇతరులను లోపలికి రానివ్వరు. అయితే ప్రభుత్వాలు మరిన్ని వెనకబడిన తరగతులను గుర్తించాలి. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వ్యక్తులు ఉన్నారు. వారు రిజర్వేషన్ ప్రయోజనం ఎందుకు పొందకూడదు..? కొన్ని కుటుంబాలు, సమూహాలు మాత్రమే ప్రయోజనం పొందుతున్నాయి" అని ఆయన అన్నారు.

# దుర్గగుడి ఈవోగా వీకే శీనా నాయక్

## ఏపీలో 9 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

**అమరావతి, విశాఖ సమాచారం:** ఏపీలో 9 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ఈవోగా వీకే శీనా నాయక్, పులివెందుల ఆర్డీవోగా జి.చిన్నయ్యను నియమించింది. కాకినాడ సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మిని ప్రభుత్వం బదిలీ చేసింది. మిగిలిన వారికి ఆయా జిల్లాల్లో మహిళా శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్లుగా, సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# రైల్వే సిబ్బందిని సత్కరించిన డిఆర్ఎం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** వాల్టెయిర్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ లలిత్ బోహ్రా అనేక మంది రైల్వే సిబ్బందిని వారి విధి పట్ల అసాధారణ అంకితభావానికి సత్కరించారు. శ్రీ మనోజ్ కుమార్ సాహూ ఎడిఆర్ఎం (ఆపరేషన్స్), ఇ. శాంతారామ్, ఎడిఆర్ఎం (ఇన్ఫ్రా), ఎంకే సాహూ, సీనియర్ డివిజనల్ ఆఫీసర్ మరియు సంబంధిత విభాగాలకు చెందిన బ్రాంచ్ అధికారులు కూడా ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనేక మంది రైల్వే ఉద్యోగుల అసాధారణ శ్రద్ధ మరియు ఆదర్శప్రాయమైన సేవలకు ఈ గుర్తింపు లభించింది.

అరకు విభాగంలో ట్రాక్ మెయింటెయినర్ అయిన శ్రీ కిలో సీతన్న, విధి నిర్వహణలో ఉన్నప్పుడు గోరాపూర్-అరకు సెక్షన్ మధ్య గూడ్స్ రైలు యొక్క హాట్ యాక్సిల్‌ను గమనించి, వెంటనే అరకు స్టేషన్ మాస్టర్‌కు తక్షణ శ్రద్ధను తెలియజేశారు. అతని త్వరిత చర్య విధి పట్ల వారి అంకితభావాన్ని ప్రదర్శిస్తూ సంభావ్య పట్టాలు తప్పడాన్ని నిరోధించింది.

మరొక సందర్భంలో, కొత్తవలస-కిరండూల్ సెక్షన్‌లోని గూడ్స్ రైలులోని శ్రీ డి రాజ మోహనరావు మరియు శ్రీ ఎ రామ కృష్ణ లోకో పైలట్లు అరకు స్టేషన్‌లోని రూట్ నంబర్ 2 గుండా వెళుతుండగా గూడ్స్ రైలులోని 8వ వ్యాగన్ నుండి పొగ మరియు మంటలు వెలువడుతున్నట్లు గమనించారు. వారు వెంటనే అగ్నిమాపక యంత్రం సహాయంతో మంటలను ఆర్పారు. బండిని వెంటనే వేరు చేశారు మరియు వారి అప్రమత్తత పట్టాలు తప్పే అవకాశాన్ని నివారించింది.

ఇదే సందర్భంలో, గూడ్స్ రైలులోని కె.రాజశేఖర్ లోకో పైలట్ మరియు శ్రీ కె రవి కుమార్ అసిస్టెంట్ లోకో పైలట్ వారి వేగవంతమైన ప్రతిస్పందనకు మరియు బొర్రాగుహలు-కరకవలస సెక్షన్‌లోని సెక్షన్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది నుండి రెడ్ సిగ్నల్ టార్చ్ లైట్‌ను గమనించడం ద్వారా పెద్ద ప్రమాదాన్ని నివారించినందుకు వారిని సత్కరించారు.

ఇంకా, రైలు భద్రతను నిర్ధారించడంలో వారి అప్రమత్తత మరియు సత్వర చర్య కోసం డిఆర్ఎం లలిత్ బోహ్రా కింది రైల్వే ఉద్యోగులను సత్కరించారు:

లోకో పైలట్ గౌరీ శంకర్ కోతాలి, దంతేవాడ స్టేషన్‌లో రైలులో విరిగిన హెలికల్ స్ప్రింగ్‌ను గుర్తించి తక్షణ చర్య తీసుకున్నారు.

భేజా స్టేషన్ స్టేషన్ మాస్టర్ శ్రీ కసంపూడి రాజశేఖర్, రైలులో బ్రేక్ బైండింగ్ గమనించి వెంటనే సెక్షన్ కంట్రోలర్‌కు సమాచారం ఇచ్చారు, వారు తదుపరి స్టేషన్‌ను అప్రమత్తం చేశారు. సమస్య త్వరగా పరిష్కరించబడింది.

విజయనగరం స్టేషన్ దాటుతున్నప్పుడు గూడ్స్ రైలు సీనియర్ రైలు మేనేజర్ శ్రీ ద్వారంపూడి సంతోష్, వ్యాగన్ నుండి దుర్వాసన మరియు పొగ వెలువడుతున్నట్లు గమనించారు. ఆయన వెంటనే లోకో పైలట్ మరియు ఆర్ఆర్ఐ క్యాబిన్‌కు సమాచారం అందించారు, దీని వలన రైలు ఆగిపోతుంది మరియు సమస్యను సకాలంలో పరిష్కరించవచ్చు.

గూడ్స్ రైలు సీనియర్ రైలు మేనేజర్ శ్రీ బి. పైడి నాయుడు, పుండి మరియు పలాస సెక్షన్ మధ్య వ్యాగన్‌లో అసాధారణతను గమనించారు. ఆయన లోకో పైలట్‌ను అప్రమత్తం చేశారు, ఇది సకాలంలో పరిష్కారానికి దారితీసింది.

మరొక సందర్భంలో, పాయింట్స్‌మన్ శ్రీ ఎ. సన్యాసి రావు, డిస్పాచ్ యార్డ్‌లో రైలు పగులును గుర్తించి, వెంటనే ఏరియా కంట్రోలర్‌కు సమాచారం అందించారు, తక్షణ శ్రద్ధను నిర్ధారించారు.

ఈ సంఘటనలు రైల్వే సిబ్బంది అప్రమత్తత, అంకితభావం మరియు నిబద్ధతను వర్ణిస్తాయి, వారి సకాలంలో చర్యలు ప్రయాణీకుల, రైళ్ల భద్రతను మరియు రైల్వే ఆస్తిని కాపాడటానికి దోహదపడ్డాయి.

# మహిళావసతి గృహాలకు పచ్చజెండా

**కార్పొరేషన్:** కేంద్ర ప్రభుత్వం సహకారంతో విశాఖ నగరంలో మూడు ప్రాంతాల్లో నిర్మించే 'వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్' నిర్మాణానికి పరిపాలన పరమైన అనుమతులు ఇస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీవీఎస్‌సీసీఎల్ (గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్) ఆయా నిర్మాణాలను పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) ద్వారా చేపట్టాలని ఆదేశించారు. ముడసర్లోవలో రూ.90.54 కోట్లు, మధురవాడలో రూ.51.08 కోట్లు, నరవలో రూ.30.38 కోట్ల వ్యయంతో ఆయా నిర్మాణాలు చేపట్టనున్నారు. మొత్తం రూ.172 కోట్లతో మూడు భవనాలు నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పాస్‌పోర్టు పోయినది

నా పేరు దున్న దినేష్. నా పాస్‌పోర్టు నెంబరు డబ్ల్యూ8073001 జారీ చేయబడిన తేదీ. 29/11/2022 మరియు అంతిమ తేది. 28/11/2032. నేను తేదీ. 15-04-2025న ఆంధ్రా యూనివర్శిటీ నుండి చిన్న వాల్టేరు బైక్ పై వెళ్తుండగా పైన చెప్పబడిన నెంబరు గల పాస్‌పోర్టు ఉన్న బ్యాగ్ పడిపోయినది.

ఎవరికైనా దొరికినచో నా సెల్ నెంబరు : 7993045088కు గాని లేదా మరొక నెంబరు 9394737591 నెంబరుకు గాని తెలియజేయవలసిందిగా కోరుతున్నాను. లేదా నా చిరునామా : దున్న దినేష్, సన్ ఆఫ్ ఉమా మహేశ్వరరావు, డో.నెం. 8-44-1/5, ఓల్డ్ సిబిఐ, చిన్న వాల్టేరు, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద, ఏయు పోస్ట్, విశాఖపట్టణం -530003, ఆంధ్రప్రదేశ్‌కు పంపగలరు.

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM**

IA. /2024 IN 5.A. No: 44 of 2024

Between:

Mr. Polavarapu Kiran Kuma ...Applicants

And:

IDBI Bank, represented by its ...Respondents

Authorized Officer cum Chief Manager,
Zonal Office, Chapel Road,
Hyderabad, Telangana District and 4 others

R-2) M/s MVR Transports, represented by its Proprietrix, Mrs. Mallina Sridevi, having office at D.No. 8-4-17, Main Road, Kovvur, West Godhavari District, Andhra Pradesh-534350

R-5) Sri Mallina Satyanaryana, S/o. M Venkata Rao, Hindu, Aged 69 years, Residing at D.No. 5-3-18, Meraka Veedhi Street, Kovvur, West Godhavari District, Andhra Pradesh-534350

R-6) Sri Mallina Venkata Srihari Rao, S/o Sri Mallina Satyanarayana Rao, Hindu, Aged 40 years, Residing at D.No. 5-3-18, Meraka Veedhi Street, Kovvur, West Godhavari District, Andhra Pradesh-534350

**NOTICE**

Take notice that the above-named petitioner filed the above IA 144/2024 against you for restoration of the SA 44/20124, for which it is posted for your notice on 13-06-2025.

Therefore, you are hereby advised to appear before the above said Court on 13-6-2015 at 10.30 a.m. either in person or through an Advocate. Failing which the matter will be decided ex-prate.

Visakhapatnam
Date: 19-04-2025

AVCN NAGESWARA RAO
ADVOCATE FOR THE PETITIONER/APPILICANT

# అతిగా మద్యం తాగి యువకుడి మృతి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** అతిగా మద్యం తాగి యువకుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆరిలోవ గాంధీనగర్‌కు చెందిన సోము అలియాస్ చుంచుడు(32) కొంత కాలంగా గంజాయి, మద్యానికి బానిస అయ్యాడు. ఆరిలోవ బాలాజీనగర్‌లోని ఓ వీధిలో స్నేహితులతో కలిసి అతిగా మద్యం తాగాడు. స్నేహితులంతా వెళ్లిపోయినా అతను అక్కడే ఉండిపోయాడు. సోమవారం తెల్లవారుజామున ఓ ఆటోలో అచేతనంగా పడి ఉన్నాడు. ఆటోడ్రైవర్ ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆరిలోవ పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సోము అవివాహితుడు, క్యాటరింగ్ పనులు చేస్తుంటాడు. జులాయిగా తిరుగుతుంటాడు. తల్లిదండ్రులు, ఇద్దరు తమ్ముళ్లు, చెల్లి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

# కోనా తాతారావు ను సత్కరించిన హోంమంత్రి అనిత



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):-** విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఛైర్మన్ గా కూటమి ప్రభుత్వం కోన తాతారావు ను నియమించింది. ఈ సందర్భంగా మంగళవారం నక్కపల్లి టిడిపి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ను మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులుగా ఉన్న తాతారావు ని డీసీసీబీ ఛైర్మన్ గా నియమించడంపై తాతారావు కు హోంమంత్రి అనిత అభినందనలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివ దత్ తదితరులు ఉన్నారు.

# మత్తు' నేరుగా నరాల్లోకి..

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** గత ఐదేళ్లు నగరం గంజాయి, మాదకద్రవ్యాలకు నిలయంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపడంతో పరిస్థితి కొంత వరకు అదుపులోకి వచ్చింది. కానీ, మత్తు ఇంజక్షన్ల బెడద మాత్రం తగ్గలేదు. నగరంలో తరచూ అవి పట్టుబడుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 760 ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్, ఒడిశాల నుంచి నిషేధిత మత్తు ఇంజక్షన్లు ఇక్కడి వస్తున్నాయని, పలువురు యువత వాటికి బానిసలవుతున్నారని పోలీసు యంత్రాంగం గుర్తించింది.



శస్త్రచికిత్సల సమయంలో మాత్రమే వాడాలి: మత్తుకు బానిసైన యువత తక్కువ ఖరీదుతో కూడిన మత్తు మాత్రలు, ఇంజక్షన్లు, వైట్నర్, నెయిల్ పాలిష్ వంటివి తీసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. సాధారణంగా మత్తు ఇంజక్షన్లు మార్కెట్‌లో అందుబాటులో ఉండవు. వీటిని వైద్యుల పర్యవేక్షణలోనే తీసుకోవాల్సి ఉంటుంది. ఔషధ దుకాణాల్లో వైద్యులు రాసిన ప్రిస్కిప్షన్ ఆధారంగా వీటిని విక్రయిస్తారు. కొనుగోలు చేసిన వారి పేర్లు కూడా నమోదు చేస్తారు. కాన్పులు, శస్త్రచికిత్సల సమయంలో, నొప్పులు భరించలేనప్పుడు రోగులకు మత్తు ఇంజక్షన్ ఇస్తారు. దీంతో రోగి 6 నుంచి 8 గంటల పాటు మత్తులో ఉండటంతో నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాంటి ఇంజక్షన్లు ప్రస్తుతం సాధారణ వ్యక్తులు మత్తు కోసం వినియోగిస్తున్నట్లు గుర్తించారు.

**డిమాండ్ ప్రకారం ధర:** నగరానికి చెందిన కొంతమంది పశ్చిమబెంగాల్ రాష్ట్రం ఖరగ్‌పూర్, ఒడిశాలోని కటక్, భువనేశ్వర్‌ల నుంచి మత్తు ఇంజక్షన్లను భారీగా దిగుమతి చేసుకుంటున్నారు. ఒక్కో బాక్సులో 50 యాంపిల్స్ ఉంటాయి. ఒక్కో ఇంజక్షన్ ధర అక్కడ రూ.50 వరకు ఉండగా, ఇక్కడికి తీసుకొచ్చి యువతకు రూ.200 నుంచి రూ.500 వరకు డిమాండ్‌ను బట్టి విక్రయిస్తున్నారు. గతంలో ఒకరిద్దరు వ్యాపారులు వీటిని విక్రయించేవారు. ప్రస్తుతం 5 నుంచి 10 మంది ఉన్నారని అంచనా. వీటిని వినియోగించేవారు పెద్ద సంఖ్యలో ఉండొచ్చని సమాచారం.

మోతాదు మించితే ప్రాణాంతకం: కొందరు స్వయంగా చేతికి ఇంజక్ట్ చేసుకుంటున్నారు. మత్తు ఇంజక్షన్లను తీసుకోవడం మద్యం కన్నా ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. వీటిని తరచూ తీసుకోవడం ద్వారా నరాల కేంద్రీకృత వ్యవస్థపై ప్రభావం చూపుతుందని, తద్వారా మానసిక సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. మోతాదు మించి తీసుకుంటే ప్రాణాలకే ప్రమాదమని పేర్కొంటున్నారు.

# జీవీఎంసీ మెకానికల్ విభాగంపై మేయర్ సమీక్ష



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ మెకానికల్ విభాగంపై మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో ఇంజనీరింగ్ అధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మట్లాడుతూ జీవీఎంసీలో గల ఎలక్ట్రికల్ వాహనాల తోపాటు జీవీఎంసీ సొంత వాహనాలు, అద్దె వాహనాలు ఎన్ని ఉన్నాయని వాటిని ఏఏ అధికారులకు కేటాయించారని మేయర్ ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు. నగరంలోని 8 జోన్లలో వ్యర్థాలు తరలించే వాహనాలు ఎన్ని ఉన్నాయని, వాటి నిర్వహణ, ఎన్ని ట్రిప్పులు వ్యర్థాలను తరలిస్తున్నాయి అలాగే జెసిబిలు, లోడర్లు , బాబ్కట్లు, క్లాప్ వాహనాలు, బీచ్ క్లీనింగ్ యంత్రాలు, తదితర వాహనాలు ఎన్ని ఉన్నాయని అవి నిర్వహించే పనితీరు పై జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు (మెకానికల్) గోవిందరావు ను అడిగి తెలుసుకున్నారు. బీచ్ ను శుభ్రం చేసేందుకు బీచ్ క్లీనింగ్ యంత్రాలు ఎన్ని పనిచేస్తున్నాయని, వాటి పనితీరును స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. జీవీఎంసీ వాహనాలకు సంబంధించి అనవసరపు ఖర్చులు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని అలాగే డీజిల్, పెట్రోలు ఖర్చులు నియంత్రణకు వాహనాలకు జిపిఎస్ సిస్టంతో పాటు డ్రైవర్ల లాగు బుక్కులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, జీవీఎంసీలో నిరుపయోగంగా ఉన్న వినియోగం లేని వాహనాలను వేలం వేసేందుకు ప్రణాళికాయుతమైన చర్యలు తీసుకోవాలని ప్రధాన ఇంజనీర్ పి శివప్రసాద్ రాజు ను మేయర్ ఆదేశించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా నగరంలో ప్రధాన గెడ్డలు, కాలువలలో లోని వ్యర్థాల పూడికల తొలగింపునకు వాటి స్థితిగతులపై ఇప్పటి నుండే చర్యలు తీసుకోవాలని, గెడ్డలను స్వయంగా పరిశీలిస్తానని మేయర్ తెలిపారు.

గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ వద్ద భద్రతా చర్యల దృష్ట్యా సమర్థవంతమైన కాపలాదారులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పరిసర ప్రాంతాలలో నిత్యం పరిశుభ్రంగా ఉండేటట్లు పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ . ఎన్.వి.నరేష్ కుమార్‌ను మేయర్ ఆదేశించారు. ఈ సమీక్షలో జీవీఎంసీ ప్రధానం ఇంజనీరు కె శివప్రసాద్ రాజు అదనప కమిషనర్లు డివి రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, కార్యనిర్వహక ఇంజనీరు రత్నాకర్ రెడ్డి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు సహాయక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# తపాలా కార్యాలయంలో నిండుగా లబ్ధిదారులు

## పోస్టల్ సర్వీసులు మాత్రం శూన్యం

**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** మండల కేంద్రం సబ్ పోస్ట్ ఆఫీస్ సేవలు గత నాలుగు వారాలుగా నిలిచిపోవడంతో తపాలా వినియోగదారులు చాలా నరకయాతన పడుతున్నారు. రిజిస్టర్ పోస్టు గాని,ఆర్డినరీ పోస్టు గాని, పలు లావాదేవీలు రావికమతం తపాలా కేంద్రం నుంచి జరగటం లేదని పోస్ట్ ఆఫీస్ వర్గాలు తెలుపుతున్నాయి. కారణమేమని వినియోగదారులు సిబ్బందిని వివరణ కోరగా కంప్యూటర్స్ రిపేర్ లో ఉన్న కారణంగా ఎటువంటి సేవలు అందించలేకపోతున్నామని తెలిపారు. తపాలా సేవలు కావాలనుకుంటే ఇటు కొత్తకోట, అటు వడ్డాది, చోడవరం, ప్రాంతాలకు వెళ్ళవలసినటువంటి పరిస్థితి నెలకొంది. ఎటు చూసినా సుమారు 15 కిలోమీటర్ల మేర పోస్ట్ ఆఫీస్ సేవలు కొరకు వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. గత నాలుగు వారాల నుంచి ఎటువంటి సేవలు ప్రజలకు అందుక పోవడం పట్ల ఉన్నత స్థాయి అధికారులు నేటి వరకు స్పందించకపోవడం చాలా విడ్డూరంగా ఉంది. ప్రజలకు ప్రతిరోజు సేవలు అందించే సంస్థ ఈ విధంగా పనిచేస్తే బయట ప్రాంతాల నుంచి వచ్చే కమ్యూనికేషన్ మొత్తం అంతా నిలిచిపోతుంది. దీనివలన నిరుద్యోగులకు మరింత ఇబ్బంది కలుగుతుంది. ఇతర ప్రాంతాల నుంచి వీరికి వచ్చే సమాచారం, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమాచారం ఎవరిది వారికి చేరకపోవడం పట్ల చేతికి అందిన అవకాశాన్ని కూడా చేజారుతోందని పలువురు నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం కావడంతో పరిసర గ్రామాల ప్రజలు అందరూ రావికమతం మండల కేంద్రం నుంచే పలు పోస్టల్ సేవలు పొందడానికి అధిక సంఖ్యలో వస్తుంటారు.అటువంటి సబ్ పోస్ట్ ఆఫీస్ లో ఇటువంటి టెక్నికల్ ఇష్యూస్తో సర్వీసులు ఆగడం చాలా దురదృష్ట కరం. కాబట్టి ఎప్పటికైనా ఉన్నతస్థాయి




అధికారులు తక్షణమే స్పందించి పోస్టల్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

# ఈ-ద్విచక్ర వాహనం.. తక్కువ ఖర్చులో..



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ప్రస్తుతం ద్విచక్రవాహనం నిత్యావసర వస్తువుగా మారింది. ధర చూస్తే రూ.లక్షల్లో ఉంటోంది. సామాన్యులు కొనుగోలు చేయలేని పరిస్థితి. మరోవైపు ఇంధనం ధరలు, కాలుష్య ఉద్గారాలు వీటికి ప్రతిబంధకాలుగా మారాయి. దీంతో విద్యుత్తు వాహనాల వైపు అందరి చూపు మళ్లుతోంది. వీటి ధరలు కూడా కొంచెం ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు తక్కువ వ్యయంతో ఈ-ద్విచక్రవాహనం తయారు చేయాలని నిర్ణయించారు. రెండు నెలలు శ్రమించి కేవలం రూ.30వేలతో ఆ వాహనాన్ని ఆవిష్కరించారు.

ప్రాజెక్టులో భాగంగా ఆలోచన: ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ట్రిపుల్‌ఈ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థినులు జి.నవ్య, ఆర్.యమున, కె.శిరీష, కె.దివ్యతేజ, జి.కుసుమ, పి.జ్యోతి ప్రసన్న, పి.హిమజ, ఎం.వి.మేఘన తమ ప్రాజెక్టులో భాగంగా బ్యాటరీతో నడిచే ద్విచక్ర వాహనాన్ని తయారు చేయాలని భావించారు. బయట మార్కెట్‌లో ఉన్న ఈ-వాహనాలను పరిశీలించారు.. వాటి ఫీచర్స్, ధరలు, వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం తదితర విషయాలు తెలుసుకున్నారు. తక్కువ ధరతో వాహనం తయారు చేస్తే ఎక్కువ మందికి అందుబాటులో ఉంటుందని భావించారు. విషయాన్ని అధ్యాపకులు డాక్టర్ ఎం.రేవతి, డాక్టర్ ఎం.దివ్య దృష్టికి తీసుకువెళ్లారు. విద్యార్థినుల ఆలోచన కార్యరూపం దాల్చడానికి అవసరమైన సహకారం అందించడానికి వారు ముందుకు వచ్చారు. తొలుత పెట్రోల్ వాహనాన్ని ఎలక్ట్రిక్ వాహనంగా మార్చడానికి గల అవకాశాలపై ప్రణాళిక రూపొందించుకున్నారు. పూర్ణమార్కెట్‌లో తుక్కు వస్తువులు విక్రయించే దుకాణం నుంచి రూ.4వేలకు స్కూటీ కొనుగోలు చేశారు.

ఉపయోగించిన పరికరాలు ఇవే: 24 వోల్ట్స్, 18 ఏహెచ్ లిథియం ఐయాన్ పాస్పెట్ బ్యాటరీ, 24 వోల్ట్, 350వాట్స్ బి.ఎల్.డి.సి. హబ్ మోటార్ కంట్రోలర్ (వెనుక చక్రానికి అమర్చిన మోటార్), 10కిలో ఓమ్స్ థ్రోటిల్ (యాక్సిలేటర్)లను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. వీటిని స్కూటీకి అమర్చడం ద్వారా ఈ-ద్విచక్ర వాహనం తయారైంది. బ్యాటరీ జీవితకాలం 4 నుంచి 5ఏళ్లు ఉంటుందని విద్యార్థినులు చెబుతున్నారు. కేవలం గంట ఛార్జింగ్‌తో ఇద్దరు వ్యక్తులు గంటకు 30 కిలో మీటర్ల వేగంతో 35 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని వెల్లడించారు. బ్యాటరీ సామర్థ్యం, డిస్‌ప్లే పెంచాల్సి ఉందని చెప్పారు. పెట్రోల్ వాహనాన్ని విద్యుత్తు వాహనంగా మార్చడానికి కేవలం రూ.30వేలు ఖర్చయినట్లు వివరించారు.

# ఊపిరి.. ఉక్కిరిబిక్కిరి

**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట):** ప్రాణవాయువు ఊపిరితిత్తుల్లోకి వెళ్లి వచ్చే వాయునాళాలు సన్నబడటమే ఆస్తమా.. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది. అందుకే, అవగాహన పెంపొందించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థకు అనుబంధంగా ఉండే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆస్తమా(జినా) మే నెల మొదటి మంగళవారాన్ని ప్రపంచ ఆస్తమా దినం నిర్వహిస్తోంది. 2025 సంవత్సరాన్ని ఆస్తమా కేర్ ఫర్ ఆల్‌గా ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది.

**జిల్లాలో 3 లక్షల మందిపైనే...**

దీర్ఘకాలిక శ్వాస సంబంధ రుగ్మతల్లో ఆస్తమా ఒకటి. దీన్నే ఉబ్బసం అని కూడా పిలుస్తారు. దీని బారిన పడుతున్నవారు రోజు రోజుకూ పెరుగుతున్నారు. జిల్లాలో మూడు లక్షల వరకు బాధితులు ఉండగా- వీరిలో 50 వేలకుపైగా చిన్నారులు ఉంటారని వైద్య వర్గాలు చెబుతున్నాయి. కొవిడ్ తర్వాత ఊపిరితిత్తుల సంబంధ సమస్యలతో బాధపడేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. పల్మనాలజీ ఆసుపత్రులు అదే రీతిన వెలిశాయి.

**అవగాహన తప్పనిసరి**

వాతావరణ కాలుష్యం, ఆహారపు అలవాట్లు, జంక్ ఫుడ్స్, ఒత్తిడితో కూడిన పనులు చేయడం, అపరిశుభ్ర పరిసరాలు, శీతల పానీయాలు, ధూమపానం తదితరాలతో పాటు వంశపారంపర్యంగానూ ఆస్తమా వచ్చే అవకాశాలు ఎక్కువని వైద్యులు చెబుతున్నారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులువు అని, ముదిరితే దీర్ఘకాలిక చికిత్స అవసరమని స్పష్టం చేస్తున్నారు.



ఆస్తమా బారిన పడుతున్న పిల్లల సంఖ్య పెరుగుతోంది. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఆరోగ్యకర ఆహారం తీసుకోవడంతో పాటు శ్వాస సంబంధ వ్యాయామాలు చేయడం ఉత్తమం.

2nd pages11.qxd 5/6/2025 8:15 PM Page 4



విశాఖ సమాచారమ్

బుధవారం 7-5-2025

# ఆనకట్టల కట్టడి

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్‌కు ఎలాంటి సాయం అందకుండా భారత్ కట్టడి చేస్తోంది. అందులో భాగంగా సింధూ, దాని పరీవాహక నదుల నుంచి పాకిస్తాన్‌కు ఇకపై చుక్క నీరు కూడా వదిలకూడదని భారత్ నిర్ణయించింది. ఆ దిశగా పూర్తిస్థాయి కార్యాచరణకు రంగంలోకి దిగింది. ఆ నదులపై అన్ని జలాశయాల సామర్థ్యాలను పూర్తిస్థాయిలో పెంచే దిశగా చర్యలు తీసుకుంటోంది. వాటిలో పేరుకుపోయిన మట్టి, ఇసుక తదితరాలను పూర్తిగా తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. తద్వారా అన్ని ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వ సామర్థ్యం గరిష్ట స్థాయికి చేరేలా చూడాలని అధికారులకు సూచించింది. జమ్మూ కశ్మీర్‌లో చినాబ్ నదిపై ఉన్న కీలక బాగ్లిహార్, సలాల్ జల విద్యుత్కేంద్రాల్లో ఆ దిశగా నాలుగైదు రోజుల క్రితం లాంఛనంగా మొదల్కెన పూడికతీత పనులు ఇప్పుడు పూర్తిస్థాయికి చేరాయి. పనుల్లో భాగంగా రెండు డ్యాముల్లో అవసరమైన గేట్లను పాక్షికంగా ఎత్తడంతో పాక్‌లోని సరిహద్దు ప్రాంతాలు నీటమునిగాయి. సింధూ జల ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో ఈ విషయమై పాక్‌కు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. 1960ల్లో ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇలా జరగడం ఇదే తొలిసారి. ఒప్పందాన్ని బూచిగా చూపుతూ పూడిక పనులను పాక్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వచ్చింది. ఇప్పుడిక ఆ ప్రాజెక్టుల్లోని పూడిక మొత్తాన్నీ తొలగించి పూర్తిస్థాయిలో నీటిని నింపనున్నారు. అప్పటిదాకా చినాబ్ నదీజలాలు పాక్‌కు పూర్తిగా నిలిచిపోయినట్టే! సింధూ ఒప్పందం ప్రకారం చినాబ్ జలాలు పాక్‌కే చెందుతాయి. వాటి ప్రవాహాన్ని భారత్ అడ్డుకోవడానికి వీల్లేదు.

జమ్మూ కశ్మీర్‌లో సింధూ, దాని పరీవాహక నదులపై ఆరుకు పైగా జలాశయాల్లో పూడికతీతను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్న ఆదేశాల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ విభాగాలు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాయి. ప్రభుత్వరంగ ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్ సారథ్యంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. బాగ్లిహార్, సలాల్‌తో పాటు జీలం నది మీది కిషన్‌గంగ జలాశయాల నుంచి పాక్‌కు నీటి విడుదలను నిలిపేశారు. దాంతో పాక్‌లోని పంజాబ్ తదితర ప్రాంతాలకు సాగునీరు నిలిచిపోయింది. సలాల్ ప్రాజెక్టును 1987లో, బాగ్లిహార్‌ను 2008లో నిర్మించారు. అప్పటినుంచీ వాటిలో పూడికతీత చేపట్టడం ఇదే తొలిసారి. సలాల్ 690 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. బాగ్లీహార్ సామర్థ్యం 900 మెగావాట్లు. పూడిక నేపథ్యంలో వాటిలో విద్యుదుత్పాదన చాలాకాలంగా సామర్థ్యం కంటే తక్కువగా జరుగుతూ వస్తోంది.

జమ్మూ కశ్మీర్‌లో సింధూ, ఉప నదులపై మొదలు పెట్టిన ఆరు ప్రాజెక్టులు పాక్ అభ్యంతరాల నేపథ్యంలో చాన్నాళ్లుగా నిలిచిపోయాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో వాటి నిర్మాణాన్ని తక్షణం పునఃప్రారంభించాలని కేంద్రం నిర్ణయించింది. సవాల్‌కోట్ (1,856 మెగావాట్లు), కిర్తాయ్ 1, 2 (1,320 ఎంవీ), పాకాల్‌దుల్ (1,000 ఎంవీ)తో పాటు 2,224 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన మరో ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి. ఇవన్నీ పూర్తయితే ఏకంగా 10 వేల మెగావాట్ల అదనపు విద్యుత్‌తో పాటు సాగు, తాగునీటి అవసరాలకు మరిన్ని జలవనరులు అందుబాటులోకి వస్తాయి. సింధూ ఒప్పందం కింద ఇలాంటి పనులకు పాక్‌కు ఆర్నెల్ల నోటీసు ఇవ్వాల్సి ఉండేది. దాన్ని నిలిపివేసిన నేపథ్యంలో భారత్ తాజా చర్యలను అడ్డుకునేందుకు పాక్‌కు పెద్దగా మార్గాలేమీ లేవు. మధ్యవర్తి అయిన ప్రపంచబ్యాంకు కూడా పెద్దగా చేసేదేమీ లేదు. ఇరు దేశాలనూ చర్చలకు ప్రోత్సహించడం తప్ప ఒప్పందం అమలుకు ఆదేశించడం వంటి అధికారాలేవీ దానికి లేవు.

పంచాంగం

బుధవారం 7-5-2025

శ్రీ విశ్వావసు నామ సంవత్సరము


ఉత్తరాణాయణం, వసంత రుతువు

వైశాఖ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. దశమి ప. 10.20 |
| నక్షత్రం | : పూర్వ ఫాల్గుణి సా. 6.17 |
| వర్జ్యం | : రా. 2.20 ల 4.07 |

# విశ్వమానవతా వికాసానికి విశేష కృషి

## నేడు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి



విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ గురించి చెప్పడానికి బహుముఖ ప్రజ్ఞాశాలి అనే పదం చాలా చిన్నది. మూర్తీభవించిన భారతీయ సంస్కృతి అంటే కొంతవరకు సరిపోతుంది. విశ్వకవి, జాతీయ గీత సృష్టికర్త, నోబెల్ అవార్డు గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ కోల్‌కతాలో 1861 మే 7 జన్మించారు. దేవేంద్రనాథ్ ఠాగూర్, తల్లి శారదాదేవీల పద్నాలుగో సంతానం. రవీంద్రుని బాల్యం చాలా చోద్యంగా గడిచింది. ఆముదం దీపం ముందు పుస్తకం పట్టుకొని కూర్చొని ఆవలిస్తూ కునికిపాట్లు పడుతూ చదివేవాడు. నిద్ర లేవగానే ఇంటి తోటలోకి పోయి ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ పరవశించేవాడు. కథలంటే చెవి కోసుకునే రవీంద్రుడు సామాన్య దుస్తులతో, నిరాడంబరంగా పెరిగాడు. బాల్యంలో ఇంట్లోనే నాలుగు గోడల మధ్య ఉండవలసి రావటంతో ఆయనకు బయటి ప్రపంచం అద్భుతంగా తోచేది. ప్రపంచమొక రహస్యమనీ, ఆ రహస్యాన్ని తెలుసుకోవాలనీ కుతూహలపడేవాడు.

పాఠశాలకు వెళ్లడానికి ఇష్టపడని ఠాగూర్ ఇంటి దగ్గరే విద్యను అభ్యసించారు. ఉదయం గణితం, చరిత్ర, భూగోళ పాఠాలను, సాయంత్రం చిత్రలేఖనం, ఆటలు, ఇంగ్లీషును అభ్యసించేవారు. ఆదివారాలలో సంగీత, భౌతిక శాస్త్రం ప్రయోగాలు, సంస్కృత వ్యాకరణం నేర్చుకొనేవారు. బెంగాలీతోపాటు ఆంగ్ల భాషల్లోనూ పట్టు సంపాదించిన రవీంద్రుడు కాళిదాసు, షేక్స్పియర్ రచనలను ఎక్కువ ఇష్టంగా చదివేవారు. సాహిత్యానికీ, బహుభాషా పాండిత్యానికీ, లలితకళలకూ, ఆధ్యాత్మిక చింతనకీ ఆలవాలమైన ఠాగూర్ కుటుంబంలో పుట్టిన రవీంద్రుడు 8 ఏళ్ళ వయస్సులోనే ఒక ఫ్రెంచి కవితకి అనువాదం చేశాడు.

ఉన్నత విద్య కోసం ఇంగ్లాండుకు వెళ్లిన రవీంద్రుడు ప్రొఫెసర్ మార్లే ఉపన్యాసాలు విని ఆంగ్ల సాహిత్యంపై మరింత అభిరుచి పెంచుకున్నారు. సాహితీవేత్తల ప్రసంగాలు విని వారితో సంభాషించి నాటకాలు, సంగీత కచేరీలకు హాజరై ఆంగ్ల సంస్కృతీ సంప్రదాయాలను ఆకళింప జేసుకున్నారు. అక్కడ తన అనుభవాలను స్నేహితుడు భారతికి లేఖలుగా రాసేవాడు. ఇంగ్లండులో ఉండగానే భగ్న హృదయం అనే కావ్యాన్ని విశ్వకవి రచించాడు. విర్గరేర్ స్వప్న బంగ, సంగీత ప్రభాత అనే భక్తి గీతాలను కూడా రాశారు.

రవీంద్రుని రచనల్లో గీతాంజలి గొప్పది. బెంగాలీ భాషలో రచించిన భక్తి గీతాలను గీతాంజలి పేరుతో ఆంగ్లంలోకి అనువదించారు. అనంతరం దీన్ని అనేక ప్రపంచ భాషలలోకి తర్జుమా చేశారు. ప్రపంచ సాహిత్యంలో ఇది ఓ గొప్ప రచన. మానవుని కృంగదీసే నిరాశ నిస్పృహలు, సకల సృష్టిని ప్రేమభావంతో చూసి శ్రమ గొప్పదనాన్ని సూచించే మహత్తర సందేశం గీతాంజలిలోని ముఖ్యాంశం. ఈ రచనకే 1913 సాహిత్యంలో నోబెల్ బహుమతి లభించింది. విశ్వకవి అనే బిరుదును సాధించి పెట్టింది. అంతేకాదు నోబెల్ పొందిన తొలి భారతీయుడిగానే కాదు ఆసియాలోనే తొలి వ్యక్తిగా రికార్డులకు ఎక్కారు. రవీంద్రుడు కేవలం రచయితగానే కాదు, చిన్నారుల హృదయాలను వికసింపజేసే ప్రాచీన గురుకులాల తరహాలోనే శాంతినికేతన్‌గా ప్రసిద్ధి గాంచిన విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ఐదుగురు విద్యార్థులతో ఆరంభించిన విశ్వభారతి క్రమంగా విస్తరించింది. ఉపాధ్యాయుల ఇళ్లలో విద్యార్థులు భోజనం చేసేవారు. ప్రాతఃకాలంలో నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకొని, తమ గదులను తామే శుభ్రంచేసి స్నానం చేయడం, ప్రార్థనలు చేయడం, నియమిత వేళలలో నిద్ర పోవడం వారి దినచర్య. ఆరోగ్యం, పరిశుభ్రత, వాక్కు శుద్ధి, పెద్దలను, గురువులను గౌరవించడం ఇక్కడ నేర్పేవారు. 1919లో కళాభవన్‌ను స్థాపించి విద్యార్థులకు విభిన్న కళలను నేర్పించేవారు.

గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయమని భావించిన రవీంద్రుడు శ్రీనికేతాన్ని నెలకొల్పి, గ్రామ పునర్నిర్మాణానికి ఎంతో కృషి చేశారు. మొదట వాల్మీకి ప్రతిభ అనే నాటకాన్ని రచించిన విశ్వకవి, తరువాత అనేక నాటకాలు రాశారు. రవీంద్రుడి కలం నుంచి జాలువారిన చిత్రాంగద నాటకం ఆయనకు మంచిపేరు తెచ్చింది. ప్రకృతి – ప్రతీక అనే నాటకంలో ప్రపంచాన్ని విడిచి పెట్టిన సన్యాసి కథను వర్ణించారు. కచదేవయాని, విసర్జన, శరదోత్సవ్, ముక్తధార, నటిర్‌పూజ మొదలగు అనేక నాటకాలను విశ్వకరి రచించాడు. మతాలు వేరైనా పరస్పర స్నేహంతో కలసి మెలసి ఉండాలనే సాంఘిక ప్రయోజనం, సందేశ మిళితమైన 'గోరా' నవల రవీంద్రుని కీర్తిని మరింత ఇనుమడిరపజేసింది.

రవీంద్రుడి ముందు నుంచి జాతీయభావం ఎక్కువ. హిందూ మేళాలో దేశభక్తి గీతాలను పాడుతూ జాతీభావాలను ప్రచారం చేశారు. పృథ్వీరాజ్ పరాజయం గురించి ప్రబోధాత్మక పద్య నాటకాన్ని రచించాడు. బాల గంగాధర్ తిలక్‌ను బ్రిటీష్ ప్రభుత్వం నిర్బంధించినపుడు రవీంద్రుడు తీవ్రంగా విమర్శించాడు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, జాతీయ నిధికి విరాళాలు సేకరించారు. 1896లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ సదస్సులో బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతాన్ని తొలిసారి ఆలపించాడు.

రవీంద్రుడు రాసిన జనగణమణను జాతీయ గీతంగా ప్రకటించే ముందు 'వందేమాతరం', 'జనగణమన'లపై దేనిని ప్రకటించాలని సుదీర్ఘ చర్చ, తర్జన భర్జనలు జరిగాయి. అంతిమంగా రవీంద్రుడి 'జనగణమన' దే పైచేయి అయింది. దీంతో రాజ్యాంగ సభ కమిటీ అధ్యక్షుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24న జనగణమనను జాతీయగీతంగా, వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించాడు. అదే సమయంలో రెండూ సమాన ప్రతిపత్తి కలిగి ఉంటాయని స్పష్టం చేశాడు.

**సుగుణశేఖర్‌రెడ్డి గుమ్మళ్ల (ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)**

# ఆంగ్లేయుల గుండెల్లోకి దూసుకెళ్లిన విప్లవ బాణం

## నేడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి



భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కనుకులేకుండా చేసిన సీతారామరాజు.. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశారు. 1924 మే 7న శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారు. నేడు 101 వ వర్ధంతి. ఈ సందర్భంగా ఆ మహావీరుడిని ఒకసారి స్మరించుకుందాం.


అల్లూరి సీతారామరాజు 1897 జులై 4న విశాఖపట్నం జిల్లా పాండ్రంగిలో జన్మించారు. అయితే పెరిగింది మాత్రం పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో. రామరాజు తండ్రి వెంకట రామరాజు, తల్లి సూర్యనారాయణమ్మ. 9వ తరగతి వరకు చదివిన అల్లూరి.. సంస్కృతం, జోతిష్యశాస్త్రం, జాతక శాస్త్రం, విలువిద్య, గుర్రపు స్వారీలో ప్రావీణ్యం పొందారు. 1917లో విశాఖపట్నం జిల్లా క్రిష్ణదేవీపేట ద్వారా మన్యంలోకి అడుగుపెట్టారు. మన్యం ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి, బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను పురిగొల్పారు. సీతారామరాజు ప్రధాన అనుచరుడు, సేనాని గాం గంటందొర. ఈయనది నడిరపాలెం గ్రామం.

గంటందొర, మిగిలిన అనుచరుల సాయంతో బ్రిటిష్ అధికారులపై విప్లవానికి అల్లూరి తెరతీశారు. 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై తొలిసారి దాడి చేశారు. 23వ తేదీన క్రిష్ణదేవీపేట పోలీస్ స్టేషన్, 24న తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై దాడిచేశారు. ఈ మూడు స్టేషన్లపై దాడి ద్వారా భారీగా ఆయుధాలను సేకరించుకొని విప్లవం ప్రారంభించారు. ఇక అక్కడి నుంచి వరసపెట్టి పోలీస్ స్టేషన్లపై దాడులు చేస్తూ బ్రిటిష్ అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. ఈ విప్లవాన్ని ఎలాగైనా అణచివేయాలని నిర్ణయించుకున్న బ్రిటిష్ ప్రభుత్వం.. మన్యంలో ముమ్మర చర్యలు చేపట్టి చాలా మంది రాజు అనుచరులను చంపేసింది.

బ్రిటిష్ ప్రభుత్వం మన్యం ప్రజలను కాల్చుకు తినడం మొదలుపెట్టింది. ప్రభుత్వం ప్రజలను పెడుతున్న కష్టాలను చూడలేని రాజు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డారు. 1924 మే 7న విశాఖపట్నం జిల్లా మంప గ్రామానికి సమీపాన రాజు స్వయంగా లొంగిపోయారు. సీతారామరాజుపై పగతో రగిలిపోతున్న బ్రిటిష్ అధికారులు ఆయన్ని చింతచెట్టుకు కట్టి కాల్చిచంపారు. మే 8న రాజు అనుచరులు ఆయన భౌతికకాయాన్ని క్రిష్ణదేవీపేటకు తీసుకువచ్చి తాండవనది పక్కన దహన క్రియలు జరిపారు. సీతారామరాజు ఆశించి కలలుగన్న స్వాతంత్ర్యం ఆయన ఆత్మత్యాగం చేసిన 28 సంవత్సరాలకు ఆగస్టు 15, 1947న భారత ప్రజలకు లభించింది.

# సినీ గీతాల ప్రపంచంలో రారాజు మనస్సుకవి

## (నేడు ఆత్రేయ వర్ధంతి)



కానీ 69 ఏళ్ల వయస్సులో (1989) ఆకస్మికంగా ఆయనకో కోరిక కలిగింది. అది కార్యరూపం ధరించాలని, అందుకు నెల్లాళ్ల వ్యవధిలో తిరిగి కలుద్దామని జగ్గయ్యగారిని కోరారు. కానీ దురదృష్టవశాత్తు అలా కలవాలనుకున్న రోజునే అకస్మాత్తుగా ఆత్రేయ తనువు చాలించారు..

తెలుగునేలలో ఆత్రేయ పేరు తెలియని పద్యం, నాటకం, సినిమా రచన ఉండవు. ఈ మూడు ప్రక్రియలలోనూ ఆత్రేయ కలం కదం తొక్కినా ఆయన సినీ కవిగానే ఎక్కువమందికి తెలుసు. ఆత్రేయ అసలు పేరు కిళాంబి వేంకట నరసింహాచార్యులు. పేరులోని ఆచార్యను, గోత్రనామమైన ఆత్రేయ సను కలుపుకొని 'ఆచార్య ఆత్రేయ' కలం పేరుతో ఆయన సుప్రసిద్ధులయ్యారు.

7.5.1921న నెల్లూరు జిల్లా, సూళ్లూరుపేట తాలూకాలోని మంగళంపాడులో ఆయన జన్మించారు. 1951లో సినీరంగ ప్రవేశం చేసిన ఆత్రేయ రచయితగా కొంతకాలం సినీరంగాన్ని ఏలారు. తన రాతతో ప్రేక్షకులను, రాయక నిర్మాతలను ఏడిపిస్తారని పేరుపడ్డారు. అంతటి ఆత్రేయ ఎన్ని సినిమాలకు ఎన్ని పాటలు రాశారో చివరి వరకూ ఎప్పుడూ లెక్కవేసుకోలేదు.

కానీ 69 ఏళ్ల వయస్సులో (1989) ఆకస్మికంగా ఆయనకో కోరిక కలిగింది. 'నా పాట నీ నోట పలకాలి' అనే మకుటంతో అసంఖ్యాకమైన తన సినిమా పాటల్లో కొన్నింటిని పుస్తక రూపంలో వెలువరించాలని. ఆ మనోవాంఛను మద్రాసు విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పట్టా కోసం పరిశోధన చెయ్యడానికి వెళ్లిన నా దగ్గర ఆత్రేయ వెలిబుచ్చారు. పుస్తక ప్రచురణకు ఆర్థికంగా తోడ్పడటానికి ముందుకొచ్చే తన నిర్మాతలు ఇద్దరు ముగ్గురున్నా, వాళ్లు తనను నమ్మడం లేదని వాపోయారు. ఆ సందర్భంగా చిత్రసీమకు సంబంధించిన ఆయన ఆత్మీయ మిత్రులలో ఆ కోరికను నెరవేర్చడానికి సమర్థులుగా డాక్టర్ కొంగర జగ్గయ్య పేరును నేను సూచించాను. ఆ సూచనను ఆత్రేయ కూడా ఆమోదిం చడంతో వెంటనే అన్నానగర్‌లో ఉంటున్న జగ్గయ్య గారిం టికి వెళ్లాం.

ఆత్రేయ సినిమా పాటలలో కొన్నింటిని మాత్రమే కాదు అంతవరకు ఆ ప్రక్రియలో వచ్చిన అన్నింటినీ అచ్చు వేద్దామని జగ్గయ్యగారు ప్రతిపాదించి పాటలు సేకరణ బాధ్యతను మాత్రం నామీద పెట్టారు. తను ఆశించిన దాని కంటే విస్తృత స్థాయిలో తన కోరిక నెరవేరుతున్నందుకు బ్రహ్మానందభరితులైన ఆత్రేయ ఆ ప్రతిపాదన వెంటనే కార్యరూపం ధరించాలని, అందుకు నెల్లాళ్ల వ్యవధిలో తిరిగి కలుద్దామని జగ్గయ్యగారిని కోరారు. కానీ దురదృష్టవశాత్తు అలా కలవాలనుకున్న రోజునే అకస్మాత్తుగా ఆత్రేయ తనువు చాలించారు (13.9.89). ఆత్రేయ సంస్మరణ సభలో జగ్గయ్య ఆత్రేయ కడపటి కోరికను వెల్లడించి, ఆయన సమగ్ర రచనల ముద్రణ కోసం ముందుకు రావాలని పరిశ్రమలోని పెద్దలకు పిలుపునిచ్చారు. ఆ సూచనకు పరిశ్రమ నుండి సానుకూలమైన స్పందన లభించింది.

జగ్గయ్య జాప్యం చేయకుండా కార్యరంగంలోకి దూకి తను మేనేజింగ్ ట్రస్టీగా మరో 8 మంది ప్రముఖులు ట్రస్టీలుగా 'మనస్విని' పేరుతో ఒక పబ్లిక్ చారిటబుల్ ట్రస్టీని నెలకొల్పారు. దాని తరఫున ఆత్రేయ లభ్య సమగ్ర సాహి త్యాన్ని 7 సంపుటాలుగా ప్రచురించారు. ఆత్రేయ సాహితికి జగ్గయ్య సంపాదకులు కాగా, నేను సహ సంపాదకుణ్ని. ఆత్రేయ సాహితిలో మూడు సంపుటాలు నాటక సాహి త్యానికి, మూడు సంపుటాలు సినిమా పాటలకు, ఏడవ సంపుటి ఆత్మకథ మొదలైన ఇతర రచనలకు కేటాయించాం. ఆత్రేయ సాహితి ఆవిష్కరణ 7.5.1990న మద్రాసులోని దక్షిణ భారత చలనచిత్ర సంఘం థియేటర్‌లో ఘనంగా జరి గింది. ఆత్రేయ సాహితికి పాఠకలోకం నుంచి అనూహ్యమైన ఆదరణ లభించింది.

ఆత్రేయ సాహితి ప్రతులు స్వల్పకాలంలోనే చెల్లిపోవడంతో ఆత్రేయ అభిమానులు పునర్ముద్రణ కోసం అడుగుతూనే ఉన్నారు. ప్రథమ ముద్రణలో మాకు కూడా కొన్ని లోటుపాట్లు కనిపించి ఆ దిశగా ప్రయత్నం చెయ్యాలను కున్నా, జగ్గయ్యగారి హఠాన్మరణం (5.3.2004)తో మన స్విని మూలబడి ఆత్రేయ సాహితి తిరిగి వెలుగుచూడ్డం సాధ్యం కాలేదు. కానీ అనుకోకుండా 25.2.2017న నేను అతిథిగా హాజరయిన 'పాడుతా తీయగా' రికార్డింగ్ కార్యక్రమంలో మాన్య మిత్రులు డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆత్రేయ సాహితి పునర్ముద్రణ ప్రసక్తి తెచ్చి, ఆ అక్కరను, దాని ఆసరాకు తన సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఆ మనస్వి ప్రతిపాదన నాకు ఆనందం కలిగించినా, ఆ అంశం మీద చర్చించి నాటక సాహిత్యానికి అంతగా ఆదరణ లేకపోవడం వల్ల పరిష్కృత ముద్రణను పాటలకు మాత్రం పరిమితం చెయ్యాలని నిర్ణయించాం.

ఈ బృహత్కార్యంలో తన ఆత్మీయ మిత్రులు, సాహితీ ప్రియులు అయిన డా. కె. ఇ. వరప్రసాద్ రెడ్డి (శాంతా బయోటెక్నిక్స్ అధినేత) భాగస్వామిని చెయ్యాలని ఎస్బీబీ సంకల్పించారు. రెడ్డిగారు సంతోషంగా అంగీకరించారు. కానీ, ఆ గాన గంధర్వుని పూనిక సాకారం కాకుండానే ఆ దుర్విధి ఆయనను మనకు దూరం చేసింది. అనంతరం బాలు వాగ్దానానికి భంగం కలుగకుండా ఆ ప్రాణమిత్రుడు తలపెట్టిన యజ్ఞాన్ని పూర్తి చేయడానికి డా. వరప్రసాద్ రెడ్డి సహృదయతతో ముందుకొచ్చారు.

ఆత్రేయ సాహితి (1990)లోని మూడు సినిమా సంపుటాలతో కలిపి అప్పట్లో వివిధ కారణాలవల్ల 1092 పాటల్ని మాత్రమే ప్రచురింపగలిగాం. ఇప్పుడు ఆ లోటును సరిదిద్దు కోవడానికి అవకాశం రావడంతో ఆత్రేయ అక్షర సేద్యానికి, బాలు పవిత్ర సంకల్పానికి న్యాయం చేయాలనే దృఢ సంకల్పంతో ఆత్రేయ సాహితి పేరుతో ఆత్రేయ సినీ గేయ సర్వస్వాన్ని విస్తృత పరిశోధనతో రెండు భాగాలుగా (ఒకే సెట్) అందిస్తున్నాం. డబ్బింగ్ చిత్రాలతో సహా 477 చిత్రాల నుంచి ఆత్రేయ మొత్తం పాటల్ని (1636) సేకరించి ప్రచురి స్తున్న ఈ సంపుటాలలో ఆత్రేయ పాట ఒక్కటి కూడా మిగలకుండా, ఆత్రేయది కాని పాట ఒక్కటీ చొరబడకుండా మా పరిధి మేరకు ప్రయత్నించాం. ఆత్రేయ అభిమానులు, సహృదయ విమర్శకులు మా శ్రమను అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

'అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్ని' అని ఆత్రేయే అన్నట్టు ఆత్రేయ సాహితి ఇంత సమగ్రంగా ఈ స్థాయిలో వెలువడ్డం ఆత్రేయ అనుకోనిది, అనుకోని 'నిధి'. ఆత్రేయ సాహితి ఆవిష్కరణ సందర్భంగా ఆత్రేయ, బాలుగార్లకు అంజలి ఘటిస్తున్నాను.

–పసలపూడి

# చరిత్రలో ఈ రోజు (మే 7)

**సంఘటనలు:**

1924: అల్లూరి సీతారామరాజును మేజర్ గుడాల్ కాల్చి చంపాడు.

1946: సోని కార్పొరేషన్ జపాన్లో స్థాపించారు.

జననాలు:

1711: డేవిడ్ హ్యూమ్, స్కాటిష్ ఆర్థికవేత్త, చరిత్రకారుడు, తత్త్వవేత్త

1812: రాబర్ట్ బ్రౌనింగ్, ఆంగ్ల కవి

1861: రవీంద్రనాథ్ టాగూర్, విశ్వకవి, భారత దేశానికి జాతీయ గీతాన్ని అందించిన కవి.

1921: ఆచార్య ఆత్రేయ, తెలుగు నాటక, సినీ రచయిత. (మ. 1989)

1987: సందీప్ కిషన్ , తెలుగు, తమిళ, హిందీ, చిత్రాల నటుడు.

**మరణాలు:**

1920: హెచ్. వి. నంజుండయ్య, మైసూరు విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతి, మైసూర్ రాజ్య దీవాన్, పరిపాలనాదక్షుడు, విద్యావేత్త

1924: అల్లూరి సీతారామ రాజు, విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు.

1968 పసుపులేటి కన్నాంబ. గాయని, రంగస్థల, చలనచిత్ర నటి

1972: దామోదరం సంజీవయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి

1973: శివ్ కుమార్ బటాల్వి, పంజాబీ భాషా కవి.

2016: బోయ జంగయ్య, రచయిత.

2019: గుండా రామిరెడ్డి తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు.

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**

**vspnews4@gmail.com**

**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# 8న ముత్యాలమ్మ తల్లి పండుగ



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడ శివాలయం రోడ్డులో కొలువై ఉన్న భక్తులపాలిట కొంగు బంగారం,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి,మహిమాన్విత శక్తి స్వరూపిని శ్రీశ్రీ ముత్యాలమ్మతల్లి (బ్రాహ్మణి) అమ్మవారి పండుగను 8 వ తేది గురువారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో అలంకరణ, భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు,టెంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.దర్శనానికి విచ్చేసిన భక్తులకు ముత్యాలమ్మతల్లి యూత్ సభ్యులు ఆధ్వర్యంలో ప్రసాదం,మజ్జిగ,చలువ పుచ్చకాయలు అందచేస్తున్నట్లు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో భారీ అన్న సమారాధన, సాయంత్రం డప్పు వాయిద్యాలు,కోలాట నృత్యాలు,బాణాసంచా కాల్పులతో అమ్మవారి అనుపు ఉత్సవం, రాత్రికి డ్యాన్స్ మస్తీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు భక్తులు, ప్రజలు ముత్యాలమ్మతల్లి జాతర మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు.

## చంద్రబాబు, లోకేష్‌లను కలసిన డీసీఎంఎస్ చైర్మన్, కోట్ని బాలాజీ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ని ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా నియమితులైన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, కుటుంబ సభ్యులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉమ్మడి విశాఖ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా నియమించినందుకు వారికీ ధన్యవాదములు తెలిపారు. ఇంత చిన్న వయస్సులో తనకు అప్పగించిన బాధ్యతను న్యాయంగా నిర్వహిస్తూ, రైతుల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తానని హామీ ఇస్తున్నాని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు, మార్కెటింగ్ సదుపాయాలను విస్తరించి, రైతులకు మెరుగైన ధరలు అందేలా ప్రణాళికాబద్ధంగా సంస్థ ముందడుగు వేయడానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. అంతేకాకుండా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పార్టీ అభివృద్ధికి శక్తీవంచన లేకుండా పనిచేస్తానని అన్నారు. పార్టీలోకి యువత పెద్ద ఎత్తున వచ్చేలా కృషిచేస్తానని, టీడీపీ పార్టీ యువతను ఎప్పుడు ప్రోత్సాహస్తుందని చెప్పడానికి తానే ఒక ఉదాహరణ అని అన్నారు. ఈ విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ఒక్కరితో సత్సహకారం తీసుకుంటూ నడుస్తానని అన్నారు.

## అతిథి అధ్యాపకుల సమస్యలపై పల్లా శ్రీనివాస్ సానుకూలం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** అతిథి అధ్యాపకులకు నెలవారి జీతాలు వచ్చేటట్టుగా ప్రభుత్వంతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని అతిథి అధ్యాపకులకు హామీ ఇచ్చారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ని వారి నివాసం వద్ద అత్యధిక అధ్యాపకుల సంఘం సభ్యులు కలసి వినతి పత్రం అందించారు. అతిథి అధ్యాపకులకు నెలవారి జీతాలు ఇప్పించవలసిందిగా కోరినారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, జేఎన్టీయూ కాకినాడ మరియు ఆదికేసరి విశ్వవిద్యాలయాలు ఇప్పటికే అతిథేపకులకు నెలవారి జీతాలు ఇస్తూ ఉన్నాయని శ్రీనివాసరావు గారికి తెలియజేశారు అదే రకంగా యుజిసి నిబంధనలు కూడా అతిథి అధ్యయపకులకు నెలవారి ఇవ్వాలని యు జి సి ఆదేశాలు కూడా ఇవ్వటం జరిగింది. శత జయంతి ఉత్సవాల సందర్భంగా అతిథి అధ్యాపకులకు నెలవారి జీతాలు ఇచ్చి పండగ వాతావరణం కల్పించాల్సిందిగా అతిథి అధ్యాపకులు సంఘ సభ్యులు కోరినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు డాక్టర్ ఎం సురేష్ మీనన్, డాక్టర్ విక్రమ్ , డాక్టర్ దాస్, డాక్టర్ త్రినాథ్, డాక్టర్ సీరిష్, సురేంద్ర, గిరీష్,శ్రీనివాస్ తదితరులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

# ప్రతి నెల జిల్లా సమీక్షా మండలి సమావేశం

- నియోజకవర్గం యూనిట్ గా అభివృద్ధికి ప్రణాళిక
- ప్రజాప్రతినిధులు సూచనలు, సలహాలు అమలు చేయాలి
- సమ్మర్ ఏక్షను ప్లాన్ పై సమావేశంలో చర్చ
- జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** అభివృద్ధిలో జిల్లాను రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలుపుటకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా మండలి సమావేశం జిల్లా ఇంచార్జి మంత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి సభ్యులు బొత్ససత్యనారాయణ, జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, వేపాడ చిరంజీవిరావు, శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ కుమార్, కె.ఎస్.ఎన్.రాజు, శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, వేపాడ చిరంజీవిరావు, జివియంసి మేయరు పి. శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు గండి బాబ్జి, మల్ల సురేంద్ర, బత్తుల తాతయ్య బాబు, పి.వి.జి కుమార్, ప్రగడ నాగేశ్వరరావు పాల్గొని వివిధ సమస్యలపై చర్చించారు.జిల్లా సమీక్షా మండలి సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ గత సమావేశంలో చర్చించిన విషయాలు, తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రతి జిల్లాను యూనిట్ గా తీసుకుని అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారని అందుకు గాను ప్రణాళికలను తయారు చేయాలని తెలిపారు. వేసవిలో తాగు నీటి సమస్యలు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో సాగునీటి కాలువలు, నిర్మాణాలు నిర్వహణ పూర్తిచేసి తొలకరి నాటికి సాగునీరు అందించుటకు యిబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కరెంటు కోతలు లేకుండా నిరంతరం, నాణ్యమైన విద్యుత్ అందించాలని తెలిపారు. చోడవరం షుగర్ ఫాక్టరీ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రిని కలవడం జరుగుతుందని, డిస్టిలరీ ఏర్పాటుకు కృషిచేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ప్రజాప్రతినిదుల సూచనలు, సలహాలను అధికారులు అమలు చేయాలని తెలిపారు. నియోజకవర్గాలలో జరుగు పనులను శాసనసభ్యులకు తెలియజేయాలని, వారిని సమన్వయం చేసుకుంటూ అభివృద్ధిసాధించాలని తెలిపారు. పదవ తరగతి ఫలితాలలో రాష్ట్ర ఉత్తీర్ణత శాతం 81కాగా 88.25 శాతం ఉత్తీర్ణత సాధించి గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలతో 5వ స్థానం సాధించడం అభినందనీయమని తెలిపారు. కె.జి.బి.వి. పాఠశాలలలో కూడా ఇంటర్మీడియెట్ లో మొదటి స్థానం, పదవతరగతిలో మొదటి స్థానంగా జిల్లా నిలిచిందని తెలిపారు. ఉపాధి హామీ శ్రామికులకు మార్చి 31 నుండి కూలిపనులు డబ్బులు బకాయిలు ఉన్నాయని వెంటనే విడుదల చేయాలని కోరారు. మినరల్ ఫండు అన్ని మండలాలకు సమానంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ గ్రామీణ నియోజకవర్గాలకు అదికంగా నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసన మండలి సభ్యులు బొత్ససత్యనారాయణ, జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, శాసన మండలి సభ్యులు వరుదు కళ్యాణి, వేపాడ చిరంజీవిరావు, శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, కె.ఎస్.ఎన్.రాజు, శాసన మండలి సభ్యులు వరుదు కళ్యాణి, వేపాడ చిరంజీవిరావు, జివియంసి మేయరు పి. శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు గండి బాబ్జి, మల్ల సురేంద్ర, బత్తుల తాతయ్య బాబు, పి.వి.జి కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, జిల్లా ఎస్.పి. తుహిన్ సిన్హా, జాయింటు కలెక్టరు ఎం. జౌహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బాలుడిగా తప్పిపోయి.. యువకుడిగా తిరిగొచ్చి



**మంత్రాలయం, :** తన పేరు తప్ప, అమ్మనాన్న పేరు కూడా తెలియని వయస్సులో తప్పిపోయిన బాలుడు 13 ఏళ్లు అక్కడా ఇక్కడా తిరిగి చివరికి కుటుంబ సభ్యుల చెంతకు చేరిన ఘటన మంత్రాలయంలో చోటుచేసుకుంది. ఓ న్యాయవాది, సర్పంచి చొరవతో ఆరేళ్ల పిల్లవాడిగా తప్పిపోయిన వినయ్‌కుమార్ 13 ఏళ్ల తర్వాత శరత్‌గా ఇంటికి రావడంతో తల్లి, తమ్ముడు, అమ్మమ్మ, మేనమామల ఆనందానికి అవధులు లేవు. ఆ యువకుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

నాకు ఆరేళ్లున్నప్పుడు మా అమ్మ, అమ్మమ్మతో మంత్రాలయంలో ఇంటి నుంచి బయటకు వచ్చాను. పనికి వెళ్లి ఆడుకుంటూ దూరం వెళ్లగా వారు కనిపించకపోయేసరికి ఏడుస్తూ కూర్చున్నా. పోలీసులు వచ్చి నన్ను హైదరాబాద్ తీసుకెళ్లి 'అగపె అర్పనీజ్' అనాథాశ్రమంలో వదిలివెళ్లారు. మేడమ్ లిన్ ఆధ్వర్యంలో దాదాపు 260 మంది అనాథలున్న ఆశ్రమంలో నన్ను చేర్పించారు. మంత్రాలయంతోపాటు నా తమ్ముడు పౌల్ పేరు మాత్రమే గుర్తుంది. దాదాపు 10 ఏళ్లపాటు ఆశ్రమంలో ఉన్న నేను ఆశ్రమానికి వచ్చిన న్యాయవాది పత్తిపాటి సజ్జనరావు వచ్చినప్పుడు మాది మంత్రాలయం సార్, అమ్మనాన్న దగ్గరకు వెళ్లడానికి సాయం చేయండని అడిగా. ఆ తర్వాత కరోనా సమయంలో ఆశ్రమం నుంచి బయటకు వచ్చి దొరికిన రైలెక్కి డోన్‌లో దిగాను. అక్కడ స్కూటర్ మెకానిక్ వద్ద 3 ఏళ్లు పని చేస్తూ కేటరింగ్ కూడా చేసేవాణ్ని.

**చదువును నిర్లక్ష్యం చేయలేదు**

ఒకవైపు పనులు చేస్తూనే ఓపెన్‌లో పదో తరగతి చదువుకున్నా. డోన్‌లోని ఓ ప్రభుత్వ అధ్యాపకుడు సాయంతో ఇంటర్ సీఈసీ గ్రూప్‌లో చేరాను. ఆయన సాయంతోనే ఎస్సీ వసతి గృహంలో ఆశ్రయం పొందుతూ 2024-25లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 500 మార్కులకుగాను 435 సాధించాను. ఒకరోజు కేటరింగ్ పని మీద రైలులో గుంటూరుకు వెళ్తుండగా హైదరాబాద్‌లో అనాథాశ్రమంలో పరిచయమైన న్యాయవాది పత్తిపాటి సజ్జనరావు కనిపించారు. ఆయన వద్దకెళ్లి మళ్లీ మంత్రాలయం వెళ్లేందుకు సాయం చేయమని కోరాను. ఆయన భార్య అనురాధ వద్దకెళ్లి మేడం మీరైనా సహాయం చేయండంటూ నా బాధ చెప్పుకొని ఆమె చరవాణి నంబరు తీసుకున్నాను. ఆమె భర్తతో మాట్లాడి ఒప్పించగా ఆయన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ద్వారా మంత్రాలయం సర్పంచి భీమయ్య నంబరు తీసుకుని మాట్లాడి ఖర్చులకు నాకు డబ్బులిచ్చి పంపించారు. సర్పంచి భీమయ్యకు ఫోన్ చేసి సోమవారం మంత్రాలయం చేరుకున్నాను. సర్పంచి తన స్నేహితుడు శాంతయ్య దుస్తుల దుకాణం వద్దకు నన్ను రప్పించి వివరాలు అడిగారు. గతంలో పిల్లలు తప్పిపోయినప్పుడు, పోలీసులు, కుటుంబ సభ్యులతో కలిసి వెతికిన మారెప్ప అనే వ్యక్తిని పిలిచి నా గురించి వాకబు చేశారు. ఆయన నన్ను గుర్తు పట్టి మా తల్లి రామాంజినమ్మకు కబురు చేశారు. వారు వచ్చి నన్ను చూసి గుర్తించి అక్కున చేర్చుకున్నారు. సోమవారం ఎస్సై శివాంజల్ గతంలో నమోదు చేసిన కేసు వివరాలు, గుర్తులు, కరపత్రాలు, దినపత్రికలో వచ్చిన కథనాలను పరిశీలించి వివరాలు సేకరించి సరైనవేనని నిర్ధారించి ఎమ్మిగనూరు డీఎస్పీకి సమాచారం ఇచ్చారు. ఆయన సూచనతో సర్పంచి భీమయ్య సమక్షంలో తల్లి, అమ్మమ్మ, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# వక్ఫ్ చట్ట సవరణ చట్టం 2025 పై ప్రజా అవగాహన సదస్సు

## వక్ఫ్ చట్ట సవరణపై అవగాహన అవసరం : మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు పై వచ్చిన అపోహలను తొలగించడానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం అనకాపల్లి ఎం.పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వక్ఫ్ చట్ట సవరణ చట్టం 2025 పై ప్రజా అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ పీవీఎం మాధవ్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భారీ ఎత్తున జిల్లా భారతీయ జనతా పార్టీ నాయకులు, ముస్లిం పెద్దలు రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ వివిధ రాజకీయపార్టీలు వక్ఫ్ బోర్డు సవరణ చట్టం పై తప్పుడు ప్రచారం చేసీ ప్రజల్లో అపోహలు సృష్టించడమే కాకుండా శాంతి భద్రత సమస్యలు తలెత్తే చేస్తున్నాయి అని వక్ఫ్ బోర్డు ఆస్తుల ద్వారా వచ్చిన ఆదాయంతో ఇప్పటివరకు ఎలాంటి నిరుపేద ముస్లిం కుటుంబాలకు లబ్ధి చేకూరలేదని పేర్కొన్నారు. కొందరి వద్దనే ఆస్తులు ఉండడంతో వారు దనికులుగా మారి వక్ఫ్ బోర్డును శాసించే స్థాయికి ఎదిగారు అన్నారు.వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ఏమతానికి వ్యతిరేకం కాదు అని ఇది ప్రజా ప్రయోజనాలు కాపాడే, వక్ఫ్ బోర్డు ఆస్తుల నిర్వహణలో సమర్థతను తీసుకువచ్చే చట్టమని వక్ఫ్ చట్ట సవరణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించ వలసిన అవసరం మనందరికీ ఉందని పేర్కొన్నారు.వక్ఫ్ సవరణ యాక్ట్ -2025 ఉత్తరాంధ్ర కో కన్వీనర్ షేక్ నూర్ భాషా షరీఫ్ మాట్లాడుతూ ఈ చట్ట సవరణ ద్వారా ముస్లిం పేద కుటుంబాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ముస్లిం సోదరులందరికీ ఈ చట్టం మీద అవగాహన కల్పించాల్సిన బాధ్యత నాయకులు ప్రజా ప్రతినిధులు తీసుకోవాల్సిందిగా కోరారు.కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్ ముమ్మన దేవుడి , ఎలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ రమా కుమారి , మరియు బీజేపీ జిల్లా ఇంచార్జి కర్రి చిట్టి బాబు జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షులు ఇబ్రహీం బాషా ,సలీమ్ బాషా , కొణతాల రాజబాబు , పొన్నగంటి అప్పారావు మరియు ముస్లిం మత పెద్దలు మరియు బిజెపి నాయకులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డీఎస్సీ - సోషల్ (స్కూల్ అసిస్టెంట్)

### స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణం( 10 వ తరగతి + ఇంటర్)

44. రిపబ్లికన్ ప్రభుత్వం , ప్రాథమిక హక్కులు, స్వతంత్ర న్యాయశాఖ వంటి అంశాలను భారత రాజ్యాంగ నిర్మాతలు అమెరికా రాజ్యంగం నుండి గ్రహించారు.
45. ఆదేశక సూత్రాలను ఐర్లాండ్ రాజ్యానికి తీసుకున్నారు.
46. ఫ్రెంచ్ రాజ్యాంగం ముఖ్యంశాలైన స్వేచ్ఛ, సమానత్వం , సౌభ్రాతృత్వాలను భారత రాజ్యాంగ పీఠికలో పొందుపరచడమైనది.
47. అర్ధ సమాఖ్య , అవశిస్తాధికారాలు వంటి విషయాలను జర్మనీ, వైమార్ రాజ్యాంగం గ్రహించడమైనది.
48. భారత రాజ్యాంగం అనేక అంశాలను భారత ప్రభుత్వ చట్టం 1935 నుండి తీసుకోవడమైనది.
49. ప్రవేశికను భారత రాజ్యాంగం ఆత్మగా అభివర్ణించినది ఎవరు?- న్యాయమూర్తి హిదయతుల్లా.
50. భారత రాజ్యాంగ ప్రవేశికకు సంబంధించిన ఉద్దేశాల తీర్మానాన్ని ప్రవేశపెట్టింది ఎవరు?- జవహర్లాల్ నెహ్రూ.
51. 1976 లో రాజ్యాంగం 42వ సవరణ ద్వారా ప్రవేశికలో' సామ్యవాద', ' లౌకిక ' అనే పదాలను చేర్చడమైంది
52. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950 సంవత్సరంలో 395 ప్రకరణలు , 8 షెడ్యూళ్ళు ఉన్నాయి. ప్రస్తుతం 12 షెడ్యూళ్ళు ఉన్నాయి.
53.. అమెరికా రాజ్యాంగంలో కేవలం 7 నిబంధనలు మూడు పుటలు మాత్రమే ఉన్నాయి. అయితే అమెరికాలో అన్ని రాష్ట్రాలకు వేరువేరు రాజ్యాంగాలు ఉంటాయి.
54. భారతదేశంలో జమ్మూ కాశ్మీర్ ను మినహాయిస్తే ఏ ఒక్క రాష్ట్రానికి ప్రత్యేక రాజ్యాంగం అంటూ లేదు.
55. భారత రాజ్యాంగాన్ని దృఢ , సరళ లక్షణాలు గల రాజ్యాంగంగా వర్ణించవచ్చును.
56. రాష్ట్రపతి ఎన్నిక , కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాలు , కేంద్ర , రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లోని అంశాలు మొదలగు వాటిని సవరించేందుకు పార్లమెంటు ఉభయ సభలలో 2/3 వ వంతు సభ్యుల ఆమోదంతో పాటు సగానికి పైగా రాష్ట్ర అసెంబ్లీల ఆమోదం అవసరం.
57. భారత రాజ్యాంగ వ్యవస్థను 'అర్థ సమాఖ్య' గా పేర్కొన్నది - కేసి.వేర్.
58. ప్రాథమిక హక్కులు భారత రాజ్యాంగంలో మూడో భాగంలో 12 నుంచి 35 వరకు గల ప్రకరణాలలో పొందుపరిచి బడి ఉన్నాయి
59. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగంలో నాలుగవ భాగంలో 51 ఏ నిబంధనలో ప్రాథమిక విధులను చేర్చారు.
60. భారత రాజ్యాంగం నాలుగవ భాగంలో 36 నుంచి 51 వరకు గల ప్రకరణలు ఆదేశిక నియమాలను తెలుపుతాయి.
61. భారత రాజ్యాంగంలో 73 వ , 74 వ రాజ్యాంగ సవరణలు ద్వారా పంచాయతీలకు, మున్సిపాలిటీ లకు రాజ్యాంగ హెూదా ఇవ్వడమైనది.

- డా.పి.వి.రామ్, ఎం.ఏ, బి.ఈడి, పి.హెచ్.డి
విశాఖ సమాచారమ్ 9553574250

# గంటాను కలిసిన విల్లూరి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖపట్నం మధురవాడ పరదేశి పాలెం సర్వేనెంబర్ 180 లో ఉన్న డాక్టర్ సదాశివరావు లేఔట్‌కు విఎంఆర్డిఏ ఎల్పీ నెంబర్ 1/2024 ఇచ్చినందుకుగాను విశాఖ టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి,జీవీఎంసీ 33 వ వార్డ్ క్లస్టర్ ఇన్చార్జ్ తిరుమల దేవి చక్రవర్తి, సదాశివరావు లేఔట్ అధ్యక్ష, కార్యదర్శి అసోసియేషన్ సభ్యులు బృందంగా బయలుదేరి భీమిలి ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావును ఎంవిపి కాలనీలో క్యాంప్ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహుకరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే గంటాతో తమ లేఔట్‌లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్ధించారు. సానుకూలంగా స్పందించిన గంటా వెంట సంబంధిత అధికారులకు వెంటనే సదరు లేఔట్ లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ సదాశివరావు లేఔట్ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రభాకర్ శర్మ, పీవీఎస్ఎన్ గుప్త, పిసీహెచ్‌పి గుప్తా, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ పాలకొండ రాయుడు మృతి పట్ల సభాపతి దిగ్భ్రాంతి



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** టిడిపి సీనియర్ నేత, మాజీ ఎంపీ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడిగా పేరుగాంచిన సుగవాసి పాలకొండరాయుడు మృతి పట్ల ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, పాలకొండ రాయుడు కడప జిల్లా రాయచోటి నియోజకవర్గం నుండి నాలుగు పర్యాయాలు శాసనసభ్యుడిగా, అలాగే ఒకసారి రాజంపేట నుంచి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారని గుర్తు చేసుకున్నారు. ప్రజల సమస్యల పట్ల చొరవతో స్పందించే నేతగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన సంతాప సందేశంలో పాలకొండరాయుడి మృతి ఆయన కుటుంబ సభ్యులకు, రాయచోటి ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు ఇది తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# పాత శ్రీకాకుళానికి మళ్లీ పండగ



**పాతశ్రీకాకుళం:** జిల్లా కేంద్రంలోని పాతశ్రీకాకుళంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ప్రతి పదేళ్ల కొకసారి ప్రతిష్మాత్మకంగా నిర్వహించే సిరిమాను ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ పదో తేదీ వరకు కొనసాగుతాయి. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాన్ని ఇప్పటికీ స్థానికులు పాటిస్తున్నారు. ఈ ప్రాంతంలోని ముత్యాలమ్మ, నూకాలమ్మ, దుర్గమ్మ, పెద్దమ్మతల్లి, సన్నాల పోలమ్మ అమ్మవార్లకు ఉత్సవాల్లో భాగంగా 36 రోజుల పాటు ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయం నుంచి దేశిల్ల వీధి, నక్క వీధి, దండి వీధి, సంతోషిమాత ఆలయ కూడలి, మావూరు వీధి, కలెక్టర్ బంగ్లా రోడ్డు, హరిజన వీధి, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేట ప్రాంతాల పరిధిలో నిత్యం వేడుకలు జరుగుతాయి. వచ్చే నెల 10న సిరిమాను ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. దీనికి సంబంధించి సోమవారం ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. సిరిమానోత్సవం రోజున అమ్మవార్ల దర్శనాలు, భోజనాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తారని, ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో కమిటీ అధ్యక్షుడు డి.పి.దేవ్, ముఖ్య ప్రతినిధులు ఎల్.రామలింగేశ్వరస్వామి, మావూరు శేఖర్, నక్క శంకరరావు, నక్క రామరాజు, గుంట ముక్కల పాపారావు, అశ్వనీకుమార్, గంగు రాజు పాల్గొన్నారు.

# నిద్రమాత్రలు మింగేసి వినతిచ్చిన మహిళ



విజయనగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఓ మహిళ నిద్రమాత్రలు మింగేసి వచ్చారు. తన స్థలంలో నిర్మాణ పనుల విషయంలో కుటుంబ సభ్యులు, ఇతరులతో ఇబ్బందిగా ఉందని చెప్పారు. న్యాయస్థానం, ఉన్నతాధికారులు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా స్థానికంగా అమలు కావడం లేదని బొండపల్లి మండలానికి చెందిన విజయలక్ష్మి ఎస్పీ వకుల్ జిందాల్ వద్ద బోరుమన్నారు. ఈక్రమంలో గట్టిగా ఏడుస్తూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ఆరా తీయగా.. నిద్రమాత్రలు తీసుకున్నట్లు చెప్పారు. దీంతో సిబ్బంది సహాయంతో మహారాజా ఆసుపత్రికి తరలించారు. ఆమెకు న్యాయం చేస్తామని ఎస్పీ చెప్పారు.

**మరికొన్ని ఇలా..**

ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేసే ఉద్యోగి తనను ఆర్థికంగా మోసగించాడని నగరానికి చెందిన మహిళ విన్నవించారు. నెలకు రూ.1.50 లక్షల లాభం వచ్చేలా చూస్తానని చెప్పి ఖాళీ చెక్కులు తీసుకొని, ఖాతా నుంచి రూ.39.80 లక్షలు డ్రా చేశారని, ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకోమంటూ బెదిరిస్తున్నాడని వాపోయారు.

నగరానికి చెందిన ఓ పాస్టరు కుటుంబం తన వద్ద రూ.32 లక్షలు అప్పు తీసుకుందని, అసలు, వడ్డీ ఇవ్వడం లేదని జొన్నగుడ్డి ప్రాంతానికి చెందిన బి.పార్వతి అర్జీ అందించారు.

విదేశాల్లో నివాసం ఉంటున్న ఓ మహిళ తన స్థలాన్ని ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తోందని, పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని రామభద్రపురం మండలం ముచ్చర్ల వలస గ్రామానికి చెందిన ఎన్.సునీతాదేవి ఫిర్యాదు చేశారు. దివ్యాంగురాలినైనా కనికరం లేకుండా వేధిస్తున్నారని చెప్పారు.

వివిధ సమస్యలపై 32 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. భూ తగాదాలపై 15, కుటుంబ కలహాలు- 3, మోసాలు- 3, ఇతర అంశాలపై 11 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ల అధికారులను ఆదేశించారు.

# ఉక్కులో ఉల్లాసం

**ఉక్కునగరం:** ఉక్కు ఉద్యోగులు నిత్యం యంత్రాలతో పోటీ పడుతూ పనిచేస్తుంటారు. ఏ స్థాయి ఉద్యోగి అయినా.. ఆ స్థాయి ఒత్తిడి ఉంటుంది. ఈ తరహా యాంత్రీకరణ జీవనం అటు ఉద్యోగులతో పాటు సంస్థకు కూడా మంచిది కాదు. దీర్ఘకాలంలో సంస్థ పురోగతి మీద కూడా దీని ప్రభావం పడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులకు కూడా కాస్త 'ఆటవిడుపు' ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిందే 'స్టీల్ క్లబ్'. దీనిద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

**వందల్లో సభ్యులు..**

స్టీల్ క్లబ్ 2003లో ఏర్పాటైంది. అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు సభ్యులుగా ఉంటారు. ఈ క్లబ్ ప్రారంభంలో సుమారు 1500 మంది సభ్యులుగా ఉండేవారు. ఉద్యోగ విరమణలు, కొందరు మృతిచెందడం వంటి కారణాల వల్ల ప్రస్తుతం 750 మంది ఉన్నారు. ప్రతి సభ్యుడు నెలకు రూ.130 చెల్లించాల్సి ఉంటుంది. యాజమాన్యం ఏడాదికి సుమారు రూ.2.50 లక్షలు క్లబ్ కార్యక్రమాల నిర్వహణకు ఇచ్చేది. ప్రస్తుతం ఆ నిధులు రావడం లేదని సమాచారం. అయితే క్లబ్ ఆధీనంలో ఉన్న పలు థియేటర్లను అద్దెలకు ఇవ్వడం వల్ల ఆ ఖర్చులను భరిస్తున్నారు.

**ఆట.. పాట..**

400 మంది పట్టే థియేటర్, స్విమ్మింగ్ పూల్, టేబుల్ టెన్నీస్, బిలియర్డ్స్, పిల్లల ఆటల పార్కు, హోటల్, బహిరంగ థియేటర్, గ్రంథాలయం వంటి సదుపాయాలు క్లబ్‌కు అందుబాటులో ఉన్నాయి. వీటిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉక్కు ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులను కూడా భాగస్వాములను చేసి ఉల్లాస కార్యక్రమాలు చేపడతారు.

**పిల్లలకు వేసవి శిక్షణ..**

ప్రస్తుతం వేసవి సెలవులు కొనసాగుతున్నందున జూన్ 15 వరకు పిల్లలకు పలు అంశాల్లో శిక్షణలు అందిస్తున్నారు. దీనిని వినియోగించుకోవాలని ఇప్పటికే ప్రకటన జారీచేశారు. ఆరో తేదీ నుంచి ఈ శిక్షణలు కొనసాగనున్నాయి.

**సభ్యుల అభిమానం చూరగొన్నాం..**

మా కొత్త కార్యవర్గం జనవరిలో బాధ్యతలు చేపట్టింది. అప్పటి నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సభ్యుల అభిమానాన్ని చూరగొన్నాం. మరమ్మతులకు వచ్చిన స్విమ్మింగ్ పూల్ బాగు చేసి అందుబాటులోకి తీసుకువచ్చాం. ఏటా సభ్యులకు వార్షిక బహుమతి అందజేసేందుకు కృషిచేస్తున్నాం.

# 20న సమ్మె జయప్రదం చేయండి

## సిఐటీయు కమిటీ సమావేశం తీర్మానం



**చోడవరం, (విశాఖ సమాచారమ్):-** కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతృత్వంలో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం,దేశంలోని కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసే విధంగా లేబర్ కోడ్స్ తెచ్చిందని, ఈ లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనాలు , రైతులకు గిట్టుబాటు ధర డిమాండ్లతో జరగబోవు మే 20వ తేదీ నాడు సమ్మెలో కార్మికులు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు. వరలక్ష్మి, జిల్లా కోశాధికారి వి. వి.శ్రీనివాసరావు. లు పిలుపునిచ్చారు. ఈరోజు చోడవరం లో సీఐటీయూ మండల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ వల్ల సమ్మె చేసే హక్కు , సంఘం పెట్టుకునే హక్కు, పనిగంటలు పెంచడం, పారిశ్రామిక వివాదాలు చట్టానికి తూట్లు పోడవటం వంటి అనేక దుర్మార్గమైన విధానాలు ఈ లేబర్ కోడ్స్ లో పొందుపరిచారని .వీటిని ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించకుండా తిప్పుకొట్టాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మే20తేది నాడు దేశవ్యాప్త సమ్మె జరుగుతుందని. దీనిలో కార్మికులు, రైతులు, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. వి నాయుడు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కె. వరలక్ష్మి, బి. రామలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ నాయకులు కొండమ్మ, రత్నం, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనకదుర్గ సన్నిధిలో సినీ నటి ఇంద్రజ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి టైటిల్ తో అనకాపల్లిలో జరుగుతున్న సినిమా షూటింగ్లో పాల్గొనేందుకు అనకాపల్లి కి వచ్చిన ప్రముఖ సినీనటి ఇంద్రజ మంగళవారం పట్టణంలో శతకం పట్టు లో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, శ్రీ గౌరీ పరమేశ్వరి ఆలయం, శ్రీ మరిడిమాంబ ఆలయంలో అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. శ్రీ కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాకులు కాండ్రేగుల నాయుడు దంపతులు, ఆలయ అధ్యక్షులు భీమరశెట్టి వరహ నూకరాజు,శ్రీ గౌరీ పరమేశ్వరుల ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, పొలిమేర శ్రీను, గ%శీ%దేపల్లి మురళి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి అధికారులను ఆదేశించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా స్థాయి కమిటి సమావేశం కలెక్టరేట్ లోనిన తన ఛాంబర్ లో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994 ను కఠినంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లా లో ప్రస్తుతం లింగనిష్పత్తి 1000మంది బాలురు, 972 బాలికలుగా ఉందని, లింగ నిష్పత్తి సమానంగా ఉండేందుకు చర్యలు చేపట్టాలని. లింగ నిష్పత్తి మండలాల వారీగా సమీక్షిస్తూ తక్కువగా ఉన్న మండలాల సిడిపివోలు మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ చేయాలని సూచించారు. బాలికలను కాపాడుకోవాలని, వారిపై వివక్ష చూపకూడదని తెలిపారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. ఏ లేబరేటరీగాని, స్కానింగ్ కేంద్రం గాని గర్భస్థ పిండం లింగాన్ని తెలిపే ఉద్దేశ్యంతో చేయరాదని, చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయిల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్లైన్ గ్రీవియన్స్ (%జూ ఎజూ అన్.ఖజూ.ప్రశీజ.ఱఅ%) ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. ఆడపిల్ల విలువ కట్టలేనిదని ఆడపిల్ల రక్షణ బాధ్యత మనదే అని అన్నారు. ఎఎన్ఎమ్, ఆశాలు గృహ సందర్శనాల ద్వారా ఆడపిల్లల సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. నూతన వధూవరులకు, గర్భవతిక, అత్త మామలకు దీనిపై అవగాహన కల్పించాలని డిఆర్ఓ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతి ప్రభ మాట్లాడుతూ జిల్లాలో 73స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కొత్తగా 03 కేంద్రాలు గుర్తింపు కొరకు, రెండు కేంద్రాలు రెన్యువల్ కొరకు, ఒక కేంద్రం మోడిఫికేషన్ కొరకు ధరఖాస్తులు వచ్చాయన్నారు. స్కానింగు కేంద్రాలను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. డెకాయ్ ఆపరేషన్ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. బాలికలు సంరక్షణపై ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ మోహన్ రావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్వోలు బాలాజీ, కె.వి.జ్యోతి, డి ఐ ఓ, ఇతర కమిటీ సభ్యులు హాజరయ్యారు.

# సినిమా చెట్టు.. కూలేటట్టు



లొల్ల లాకుల వద్ద బ్యాంక్ కెనాల్ చెంతన నీటి ఒరవడికి పురాతన మామిడి చెట్టు మొదలు మట్టి కొట్టుకుపోయి పటుత్వం కోల్పోతోంది. ఈ చెట్టు వద్ద సీతారామయ్య గారి మనవరాలు వంటి ఎన్నో కుటుంబ కథా చిత్రాల్లో పలు సన్నివేశాలను చిత్రీకరించారు. మరెన్నో వివాహ అల్బమ్‌లలో ఇక్కడి అందాలను బంధించారు. అటువంటి చెట్టు వేర్లు ప్రస్తుతం బయటపడి కూలే స్థితిలో ఉంది. చుట్టూ మట్టితో పటిష్ఠం చేసి కాలువ వైపున రివిట్‌మెంట్ చేస్తే ప్రయోజనం ఉంటుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

# అదనపు భవనం కు ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన



**దేవరాపల్లి (విశాఖ సమాచారమ్):-** మండలంలోని బేదపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కు అదనపు భవనాన్ని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు విద్యార్థులకు ఉత్తమ విద్యను బోధించి ఉన్నత శిఖరాలను అధిరోహించ విధంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగినందుకు పాఠశాల ప్రిన్సిపాల్ చొక్కాకుల భువనమాధురి ను తోటి ఉపాధ్యాయ సిబ్బందిని ఎమ్మెల్యే ప్రశంసించారు ఇదే విధంగా ప్రతి ఏడాది జిల్లాకే మొదటి స్థానంలో నిలవాలని ఆయన సూచించారు అదేవిధంగా మార్చి నెల గుజరాత్ లో జరిగిన జాతీయ స్థాయి పారా టేబుల్ టెన్నిస్ కాంస్య పత కం సాధించిన గుల్లిపల్లి తేజస్విని ఇంటికి వెళ్లి అభినందించారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో రైవాడ జలాశయం చైర్మన్ పోతల పాత్రు నాయుడు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ సర్పంచ్ చల్లా లక్ష్మీ నాయుడు స్కూల్ చైర్మన్ ఎలమంచిలి భవాని కిమిడి నాగేశ్వరరావు మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు శ ర కాన సూర్యనారాయణ పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు..!!

- ఆదమరిస్తే అంతే సంగతులు.. ప్రాణాలు గాల్లో కలవలసిందేనా...??
- కేబుల్ వైర్లు చుట్టి ఉంచిన విద్యుత్ వైర్లు తో పొంచి ఉన్న ప్రమాదం...
- నిర్లక్ష్య వైఖరిలో ప్రజలు ప్రాణాలు తో చెలగాటం ఆడుతున్న విద్యుత్ అధికారులు



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** మండలంలోని వడ్డాది సబ్ స్టేషన్ కి కూతవేటు దూరంలో ఉన్న ఎల్ బి పి అగ్రహారంగ్రామం మెయిన్ రోడ్ లో వాటర్ ట్యాంక్ ఎదురుగా కాలువ గట్టు పై విద్యుత్ వైర్లు కిందకి వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. ఇక్కడ రైతులు, ప్రజలు పొలాల లోకి ఈ కాలువ గట్టు పై నుండి రాక పోకలు సాగిస్తుంటారు.

అలాంటి ఈ ప్రదేశంలో ఎటువంటి జాగ్రత్తలు పాటిం చకుండా తలల కు తగిలే ఎత్తులలో విద్యుత్ వైర్లు వ్రేలాడడం భయాందోళనలు కు గురిచేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను వేసి చేతులు దులుపుకుంటు న్నారే తప్ప వాటి పర్యవేక్షణ పట్ల శ్రద్ధ చూపడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్న సరే సంబంధిత శాఖ అధికా రులకు పై చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడంతో అధికారులు ప్రజలు ప్రాణాలు గాలి కి వదిలేసి నిర్లక్ష్య వైఖరి లో అధికారులు చోద్యం చూస్తున్నారు. నిత్యం ప్రజల సంచరిస్తున్న ప్రదేశంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండడంతో భయాం దోళనలో ఉన్న ప్రజలు విద్యుత్ శాఖ అధికా రులు తీరుపై మండిపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు వసూళ్లపై ఉన్న శ్రద్ధ పనుల చూపడం లేదని ప్రజలు వాపోతు న్నారు. కిందికి వేలాడుతున్న వైర్లుకు జాయింట్లు ఉన్న దగ్గర సీల్డ్ చేయలేదని ఏ క్షణాన ఏం జరుగుతుందోనని నిత్యం భయపడుతున్నామని ఇకనైనా ఉన్నతాధికా రులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# 10 విద్యార్థులను సత్కరించిన హోంమంత్రి అనిత

**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి లో తన క్యాంప్ కార్యాలయం వద్ద పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం విద్యకుసుమాల అభినందన కార్యక్రమం నిర్వహించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థుల అభినందన కార్యక్రమంలో హోం మంత్రి అనిత పాల్గొన్నారు.



సుమారు 50 ప్రభుత్వ పాఠశాల నుండి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో హాజరయ్యారు.విద్యార్థులతో ముఖాముఖీలో మంత్రి అనిత పాల్గొని విద్యార్థులను అభినందించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పరిధిలో 101 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 5000 రూపాయలు చొప్పున తన సొంత నిధులు బహుకరించి జ్ఞాపికలతో విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాయకరావుపేట నియోజకవర్గంలో 2002 సంవత్సరంలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించానని, అప్పటి నుండి నాకు పాయకరావుపేట నియోజకవర్గంతో అభినవభవ సంబంధం ఉందని గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పిల్లలు మట్టిలో మాణిక్యాలని ప్రైవేటు స్కూల్ లో చదువించడం కొంతమంది ఫ్యాషన్ గా భావిస్తున్నారని, ప్రైవేటు పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలలో చదివించేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి తెలిపారు. ఉపాధ్యాయులు అంటే నా కుటుంబం అనే భావన ఉంటుందని, పిల్లలను తల్లిదండ్రులు మంచిగా చదివించాలి అని విద్యార్థులు కూడా ఉన్నతంగా చదువుకుని ఉన్నత స్థాయి ఉద్యోగాలు సంపాదించుకుని మంచి స్థానంలో ఉండాలని అన్నారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చామని పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, పాఠశాల అంటే ఒక పవిత్రమైన దేవాలయం అని అన్నారు. విద్యాలయాల్లో రాజకీయాలకు తావులేకుండా చేస్తామని విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్న మంత్రి లోకేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఈ సందర్భంగా అన్నారు. అలాగే ప్రతీ సంవత్సరం కూడా పాయకరావుపేట నియోజకవర్గంలో విద్యాకుసుమాల అభినంధన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. నేను గతంలో టీచర్ అయినందకు చాలా ఆనందంగా ఉందని కనిపించే దేవుళ్ళు ఉపాధ్యాయులు, డాక్టర్లు అని అన్నారు.డాక్టర్లు కూడా ఉపాధ్యాయులు వద్దే విద్యను అభ్యసిస్తారు అని చదువుల్లో ఏ విధంగా రాణించాలో ఉపాధ్యాయులు విద్యార్థులకు గైడ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత ఉపాధ్యాయులును అభినందించారు.

# రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేస్తాం

## బుచ్చయ్యపేట మండల సర్వసభ్య సమావేశంలో బత్తుల తాతయ్యబాబు

**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేస్తామని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు అన్నారు. మంగళవారం ఎంపిపి దాకవరపు నాగ జగదీశ్వరి దేవి అధ్యక్షత న బుచ్చయ్యపేట మండలం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ అధికారులు మండల తహసీల్దార్ లక్ష్మీ, ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల అధికార యంత్రాంగం హాజరయ్యారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పేదవాడికి సొంత ఇల్లు నిర్మాణమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల లక్ష్యమని అన్నారు. గతంలో పక్కా గృహాలు మంజూరై వివిధ కారణాల వల్ల నిర్మాణ పనులు చేయలేకపోయినా పేదలకు అదనపు సాయం క్రింద బీసీ, ఎస్సీలకు అదనపు రూ.50వేలు చొప్పున, ఎస్టీలకు రూ.75వేల చొప్పున ఇస్తామన్నారు. గృహ నిర్మాణాల కోసం మొత్తంగా రూ.3,219 కోట్లు అదనంగా ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అదేవిధంగా అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మండలంలో ఉన్న ఎంపీటీసీ లు, సర్పంచ్ లు, అధికారులు పాల్గొన్నారు.

2nd pages11.qxd 5/6/2025 8:15 PM Page 8



# క్రీడా సమాచారమ్

## వదులుకున్నోళ్లు.. అదరగొడుతున్నారు




తమ ఆటగాళ్లను వదులుకున్నందుకు ఇప్పుడు అత్యంత విచారం వ్యక్తం చేయాల్సిన స్థితిలో ఉన్న జట్టు ఏదంటే రాజస్థాన్ రాయల్స్ అనే చెప్పాలి. రిటెన్షన్ సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోక ఎక్కువ నష్టపోయింది ఆ జట్టే అని చెప్పాలి. ఎన్నో ఏళ్ల పాటు రాజస్థాన్ రాయల్స్‌లో అంతర్భాగంగా ఉంటూ ప్రతి సీజన్లో నిలకడగా రాణించిన ఆటగాడు జోస్ బట్లర్. తన ఓపెనింగ్ భాగస్వాములుగా ఎవరున్నా సరే.. ఒక ఎండ్‌లో బట్లర్ అదరగొట్టేవాడు. అవసరానికి తగ్గట్లు కొన్నిసార్లు అతను మూడో స్థానంలో కూడా ఆడి రాణించాడు. గత సీజన్లో కూడా రాజస్థాన్ తరఫున 11 మ్యాచ్‌లు ఆడి రెండు శతకాలు సహా 359 పరుగులు సాధించాడు.

అయినా అతణ్ని వదిలేసిందా జట్టు. ఈ సీజన్లో గుజరాత్ టైటాన్స్ సొంతమైన బట్లర్.. అద్భుత బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. గత సీజన్లను మించిన నిలకడతో 10 మ్యాచ్‌ల్లో 78.33 సగటుతో 470 పరుగులు చేశాడు. ఓపెనింగ్‌లో శుభ్‌మన్ గిల్, సుదర్శన్ బలమైన పునాది వేస్తుంటే.. తర్వాత బట్లర్ అందుకుంటున్నాడు. ఈ సీజన్లో గుజరాత్ నిలకడగా టాప్-3లో కొనసాగుతోందంటే అందులో బట్లర్ పాత్ర కీలకం. రాజస్థాన్ తరఫున పెద్దగా ఆకట్టుకోలేకపోయిన దేవ్‌దత్ పడిక్కల్ సైతం బెంగళూరు తరఫున నిలకడగా రాణిస్తున్నాడు. అతను భారీ స్కోర్లు చేయకపోయినా కొన్ని విలువైన ఇన్నింగ్స్‌లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. పడిక్కల్ 10 మ్యాచ్‌ల్లో 247 పరుగులు సాధించాడు.

**ఇటు బౌల్ట్.. అటు చాహల్**

ఇక గత సీజన్ వరకు రాజస్థాన్‌తో ఉండి మళ్లీ తన పాత జట్టు ముంబయికి వచ్చేసిన పేస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ సైతం గొప్పగా బౌలింగ్ చేస్తున్నాడు. ఈ సీజన్లో అతను 11 మ్యాచ్‌ల్లో 21 సగటుతో 16 వికెట్లు పడగొట్టి టాప్ బౌలర్ల లిస్టులో కొనసాగుతున్నాడు. ముంబయి మళ్లీ బౌలింగ్‌లో బలం పుంజుకోవడానికి బౌల్టే (%ఱతీవత్ దీశీబశ్రీ%) ప్రధాన కారణం. రాజస్థాన్ తరఫున కూడా అతను మెరుగైన ప్రదర్శనే చేశాడు కానీ.. ముంబయి జట్టులోకి వచ్చాక పతాక స్థాయిని అందుకున్నాడు.

రాయల్స్ జట్టులో చాలా ఏళ్ల పాటు కీలక బౌలర్‌గా ఉన్న యుజ్వేంద్ర చాహల్ సైతం ఈ సీజన్లో ఆ జట్టుకు దూరమయ్యాడు. పంజాబ్ అతణ్ని ఎంచుకుంది. అతను వేలంలో రూ.18 కోట్ల రేటు పలికాడు. ఆరంభ మ్యాచ్‌ల్లో చాహల్ అంత గొప్పగా రాణించలేదు కానీ.. సీజన్ మధ్యలో పిచ్‌లు మారడంతో మళ్లీ తన స్పిన్ మాయాజాలం చూస్తున్నాం. కోల్‌కతాతో స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో 4 వికెట్లతో అదరగొట్టి జట్టును గెలిపించాడు. చెన్నైపై ఏకంగా హ్యాట్రిక్ సహా ఒకే ఓవర్లో నాలుగు వికెట్లు తీశాడు. ఆర్సీబీపైనా జట్టుకు విజయాన్నందించాడు.

అతడి రాకతో అద్భుతం

పంజాబ్ జట్టు కూడా మరో టీం నుంచి వచ్చిన ఆటగాడి వల్ల బాగా ప్రయోజనం పొందింది. అతనెవరో కాదు.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్. గత సీజన్లో అతను కోల్‌కతాకు కప్పు అందించాడు. కానీ మేనేజ్మెంట్‌తో విభేదాలు వచ్చాయా.. లేక ఎక్కువ రేటు కోసం వేలంలోకి వచ్చాడా తెలియదు కానీ.. రూ.26.75 కోట్ల భారీ రేటుకు పంజాబ్ సొంతమైన శ్రేయస్.. ఆ రేటుకు పూర్తి న్యాయం చేస్తున్నాడు. శ్రేయస్ కెప్టెన్ కావడంతో పంజాబ్ ఆట ఒక్కసారిగా మారిపోయింది. గత 11 ఏళ్లలో సాధ్యం కాని విధంగా 14కు మించి పాయింట్లు సాధించి.. ప్లేఆఫ్స్ దిశగా దూసుకెళ్తోంది పంజాబ్. బ్యాటర్‌గా అదరగొడుతూ, కెప్టెన్‌గా జట్టును సమర్థంగా నడిపిస్తూ పంజాబ్ రాత మార్చేశాడు శ్రేయస్. ఈ సీజన్లో ఇప్పటికే అతను 400కు పైగా పరుగులు సాధించాడు. అందులో నాలుగు అర్ధశతకాలున్నాయి.

**సాల్ట్.. అలవాటైన ఆటతో...**

కోల్‌కతా మిస్ చేసుకున్న మరో ఆటగాడు ఫిల్ సాల్ట్. కేకేఆర్‌కు ఓపెనింగ్‌లో బలమైన ఆటగాడిగా ఉంటూ గత ఏడాది కప్పు గెలవడంలో కీలకంగా మారిన సాల్ట్.. ఈసారి బెంగళూరుకు మారాడు. అటు కోల్‌కతా ఓపెనింగ్‌లో బలహీనపడగా.. ఇటు ఆర్సీబీ ఆ విషయంలో బలపడింది. కోహ్లితో కలిసి జట్టుకు కొన్ని మ్యాచ్‌ల్లో చక్కటి ఆరంభాలిచ్చాడు సాల్ట్. కొంచెం ఆచితూచి ఆడే కోహ్లికి.. సాల్ట్ రూపంలో దూకుడైన భాగస్వామి దొరకడంతో ఆ జట్టుకు ఓపెనింగ్‌లో తిరుగులేకపోయింది. సాల్ట్ మరీ పెద్ద స్కోర్లు చేయకపోయినా దూకుడైన ఆటతో జట్టుకు ఉపయోగపడ్డాడు. 9 మ్యాచ్‌ల్లో 239 పరుగులు చేసిన సాల్ట్.. గాయంతో కొన్ని మ్యాచ్‌ల నుంచి ఆడట్లేదు.

**కేఎల్.. కసిగా**

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను మూడు సీజన్ల పాటు కెప్టెన్‌గా నడిపించాడు కేఎల్ రాహుల్. తొలి రెండు సీజన్లలో ఆ జట్టు ప్లేఆఫ్స్ కూడా చేరింది. కానీ గత సీజన్లో లీగ్ దశలో నిష్క్రమించింది. ఐతే బ్యాటర్‌గా కేఎల్ మూడు సీజన్లలోనూ సత్తా చాటాడు. గత సీజన్లో మాత్రం జట్టును ముందుకు తీసుకెళ్లలేకపోయాడు. ఐతే సన్‌రైజర్స్‌తో ఒక మ్యాచ్‌లో జట్టు తేలిపోయినందుకు బహిరంగంగా మైదానంలో అందరి ముందూ రాహుల్‌ను తిట్టాడు యజమాని సంజయ్ గోయెంకా. అది తీవ్ర వివాదాస్పదమైంది. కట్ చేస్తే ఈ సీజన్‌కు లఖ్‌నవూను వదిలేశాడు కేఎల్. దిల్లీ అతణ్ని ఎంచుకుంది. కెప్టెన్సీ ఇస్తామన్నా అతనే వద్దనుకున్నాడు. బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా జట్టుకు పెద్ద బలంగా మారాడు. ఎంతో కసిగా ఆడుతూ 9 మ్యాచ్‌ల్లో అతను 371 పరుగులు సాధించాడు. కొన్ని సీజన్ల నుంచి తడబడుతున్న దిల్లీ.. ఈ సీజన్ తొలి అర్ధభాగంలో దిల్లీ టాప్‌లో దూసుకెళ్లడానికి కేఎల్‌యే ప్రధాన కారణం. ఆ జట్టు ప్లేఆఫ్స్ చేరేలాగే కనిపిస్తోంది.

**వీళ్లు కూడా...**

గత సీజన్లలో లఖ్‌నవూకు ఆడి.. ఇప్పుడు మరో జట్టు తరఫున సత్తా చాటుతున్న మరో ఆటగాడు కృనాల్ పాండ్య. అతను ఆర్సీబీకి ఈ సీజన్లో పెద్ద బలంగా మారాడు. కొన్ని మ్యాచ్‌ల్లో బంతితో సత్తా చాటిన అతను.. దిల్లీపై బ్యాటింగ్‌లోనూ చెలరేగి 73 పరుగుల అజేయ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు.

ఫిల్ సాల్ట్ రాకతో లాభపడ్డ ఆర్సీబీ.. విల్ జాక్స్‌ను దూరం చేసుకుని కొంచెం నష్టపోయింది. అతను ముంబయి జట్టులో బ్యాటుతో బంతితో సత్తా చాటుతున్నాడు. 142 పరుగులు చేయడంతో పాటు 5 వికెట్లు తీశాడు. రెండు మ్యాచ్‌ల్లో ముంబయి విజయానికి తోడ్పడ్డాడు.

సన్‌రైజర్స్ తరఫున పెద్దగా రాణించని మార్‌క్రమ్ ప్రస్తుతం లఖ్‌నవూ తరఫున ఆల్‌రౌండ్ ప్రదర్శన (346 పరుగులు, 6 వికెట్లు)తో అదరగొడుతున్నాడు. అబ్దుల్ సమద్ (160 పరుగులు) సైతం కొన్ని విలువైన ఇన్నింగ్స్ ఆడాడు.

బెంగళూరు తరఫున భువనేశ్వర్ (12 వికెట్లు) కూడా నిలకడగా రాణిస్తున్నాడు. గతంలో సన్‌రైజర్స్‌కు ప్రాతినిధ్యం వహించి ఇప్పుడు పంజాబ్‌కు ఆడుతున్న యాన్సెన్ (11 వికెట్లు) సైతం స్థిరంగా సత్తా చాటుతున్నాడు.

## 'పది' ప్రతిభావంతులకు విమాన ప్రయాణం




**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఓ ఉపాధ్యాయుడు విమానం ఎక్కించారు. మండలస్థాయిలో తొలిస్థానంలో నిలిచే విద్యార్థులను విమానంలో తీసుకెళ్తానని విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గోపన్నవలస ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మరడాన సత్యారావు హామీ ఇచ్చారు. గత నెల 23న వచ్చిన ఫలితాల్లో గర్భాం, భైరిపురం పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎస్.వివేక్(593), టి.రేవంత్(591) మంచి మార్కులు సాధించారు. విద్యాశాఖ అధికారుల అనుమతితో ఆదివారం రైలులో విజయవాడ వెళ్లారు. 8.45 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి విశాఖకు చేరుకున్నారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయనగరం వచ్చారు. వీరిని సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్, ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

## నేర విచారణలో ఫోరెన్సిక్ ఆధారాల పాత్ర కీలకం


### డీఐజీ గోపీనాథ్ జట్టి




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** నేరాల దర్యాప్తులో ఆధునిక శాస్త్రీయ విధానాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, అనకాపల్లి పట్టణంలోని శంకరం జీవీఎంసీ హాల్లో (గుండాల జంక్షన్) జిల్లా పోలీసులు ఒకరోజు సమీక్షా సమావేశం మరియు శిక్షణా వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నిర్వహించారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, ముఖ్య అతిథిగా హాజరై, నేరస్థలాల్లో ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, నిర్వహణ, 'చైన్ ఆఫ్ కస్టడీ' పాటించాల్సిన విధానాలను అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాధితులకు న్యాయం జరగాలంటే, దర్యాప్తు అధికారులు, ఫోరెన్సిక్ వైద్యులు మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ శిక్షణ ద్వారా నిందితులకు తగిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, మాట్లాడుతూ, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మరియు ఎఫ్.ఎస్.ఎల్ డైరెక్టర్ పాల్ రాజు మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం దర్యాప్తు నాణ్యతను పెంచడంలో దోహదపడుతుందన్నారు. ఫోరెన్సిక్ నిపుణుల సూచనలు, మార్గదర్శకాలు అధికారులకు ఉపయుక్తంగా ఉంటాయని అన్నారు. వర్క్ షాప్‌లో నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, విషపదార్థాలు (టాక్సికాలజీ), డిజిటల్ ఆధారాలు, సైబర్ నేరాల పరికరాలు, ఆడియో-వీడియో ఫుటేజ్, డీఎన్ఏ, రక్త నమూనాలు, మానవ అవయవాలు వంటి ఆధారాల సేకరణ, ప్యాకింగ్, భద్రపరచే విధానంపై శిక్షణ ఇచ్చారు. సంబంధిత ఆధారాలతో పాటు పంపించాల్సిన డాక్యుమెంటేషన్ గురించి కూడా సూచనలు అందించారు. ఈ శిక్షణను ఆర్.ఎఫ్.ఎస్.ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.నాగరాజు, శాస్త్రీయ సహాయకులు ఎం.రాంబాబు, పి.వి.ఎస్.బి.చలపతి, ఇ.కిరణ్ కుమార్‌లు నిర్వహించారు. వారు అధికారుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణు స్వరూప్, ఫోరెన్సిక్ వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ ఇన్స్పెక్టర్‌లు లక్ష్మణ్ మూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, విజయ, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు మరియు జిల్లా సీఐలు, ఎస్సైలు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

## రేపు ఏపీ ఐసెట్ ప్రవేశ పరీక్ష

**● 94 పరీక్షా కేంద్రాలు ● 37,572 మంది విద్యార్థులు ● నిమిషం అలస్యమైనా అనుమతించరు. ● సెట్ చైర్మన్ ఆచార్య జి.పి రాజశేఖర్**




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రవ్యాప్తంగా ఎంబీఏ- ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సంయుక్త ప్రవేశ పరీక్ష ఏపీ ఐసెట్ 2025 రేపు రెండు సెషన్స్ నిర్వహిస్తున్నట్లు ఏపీ ఐసెట్ చైర్మన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. ఈరోజు పాలకమండలి సమావేశ మందిరంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ .ఎన్ ధనంజయరావు, సెట్ కన్వీనర్ ఆచార్య ఎం.శశి లతో కలిసి పరీక్ష వివరాలను వెల్లడించారు. ఈ పరీక్షకు ఆంధ్రప్రదేశ్ తో పాటు హైదరాబాదులో 94 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పరీక్షకు 37, 572 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, రేపు ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు రెండవ సెషన్ జరుగుతుంది. ఉదయం సెషన్ లో పరీక్ష రాసేవారికి ఉదయం 7:30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతిస్తారు. మధ్యాహ్నం సెషన్ లో పరీక్షలు రాసేవారికి మధ్యాహ్నం ఒంటిగంట నుంచి పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతిస్తారు.

కంప్యూటర్ ఆధారితంగా జరిగే ఈ పరీక్షకు అభ్యర్థులు తమ హాల్ టికెట్, ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకువెళ్లాలి. పరీక్ష కేంద్రంలో బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ ను ఉపయోగించవచ్చు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరు. పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన భద్రతా ఏర్పాట్లను చేపడుతున్నారు. హాల్ టికెట్లు cets.apsche.ap.gov.in వెబ్సైట్లో పొందుపరిచామని విద్యార్థులు డౌన్లోడ్ చేసుకుని నేరుగా పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని తెలిపారు.

పరీక్షకు ఎటువంటి నెగిటివ్ మార్కింగ్ లేదని అభ్యర్థులు కాలాన్ని సక్రమంగా, సమర్ధవంతంగా వినియోగించుకొని పరీక్షను విజయవంతంగా పూర్తి చేయాలని కన్వీనర్ ఆచార్య ఎం శశి సూచించారు. ముందుగా ప్రాథమిక కీని విడుదల చేసి, అనంతరం ఈనెల 21న ఫలితాలు విడుదల చేస్తామని ఆమె తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఎండల తీవ్రత, ట్రాఫిక్ ను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని సెట్ కన్వీనర్ సూచించారు.

## 6400 కి..మీ.. 36 దేశాలు.. ఎడారులు.. సిల్క్ రోడ్ కథ చెప్పిన పూరి జగన్నాథ్



**ఇంటర్నెట్ డెస్క్:** దర్శకుడు పూరి జగన్నాథ్‌మరో ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. సిల్క్ రోడ్ గురించి వివరించారు. ఈ రోడ్‌లో ప్రయాణించడం ఎంతో ప్రమాదకరమని ఆ రూట్‌లో వెళ్తే ప్రాణాలతో వస్తారో, లేదో కూడా తెలియదని చెప్పారు. 'పూరి మ్యూజింగ్స్' పేరుతో ఆయన వివిధ అంశాలపై తన అభిప్రాయాన్ని పంచుకుంటున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తాజాగా సిల్క్ రోడ్ గురించి వివరించారు.

"పూర్వం చైనా నుంచి యూరప్ వరకూ ఒక కనెక్టింగ్ రూట్ ఉండేది. దాని పేరు సిల్క్ రోడ్. అప్పట్లో చైనా సిల్క్‌కు యూరప్‌లో విపరీతమైన డిమాండ్ ఉండేది. సిల్క్ బిజినెస్ కోసం ప్రారంభమైన రూట్ ఇది. 36 దేశాలను కలుపుతూ.. 6,400 కిలోమీటర్లు ఉండేది. చైనా, మంగోలియా, పాకిస్థాన్, ఇరాన్, ఇరాక్, ఈజిప్ట్, కజికిస్థాన్, సిరియా, టర్కీ ఇలా అన్ని దేశాలు కనెక్ట్ అయి ఉంటాయి. అయితే, ఈ రూట్‌లో వెళ్తే ప్రాణాలతో వస్తారో, లేదో ఎవరికీ తెలియదు. అంత ప్రమాదకరంగా ఉంటుంది. ఎందుకంటే ఎన్నో ఎడారులను దాటుకుంటూ వెళ్లాలి. ఇసుక తుపానుల మధ్య ప్రయాణం చేయాలి. పైగా విపరీతమైన ఉష్ణోగ్రతలు ఉండేవి. ఒంటెలు, గుర్రాలు లేకుండా ఎవరూ ప్రయాణం చేయలేరు. చైనా నుంచి టర్కీకి చేరాలంటే ఒక సంవత్సరం పట్టేది".

"ఈ రోడ్ ద్వారా ఇండియా నుంచి సిల్క్‌తో పాటు మసాల, కుంకుమ, దాల్చిన చెక్క, మిరియాలు ఎగుమతి చేసేవారు. చైనా నుంచి ఏనుగు దంతాలు, రోమ్ నుంచి బంగారం, వెండి ఎగుమతి చేసేవారు. ఇలా రకరకాల బిజినెస్‌లు జరిగేవి. ఈ రోడ్ వల్ల ఇస్లాం, బుద్ధిజం, క్రిస్టియానిటీ అక్కడి నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి అక్కడికి వచ్చేసేవి. మొదటిసారి చైనా వాళ్లు పేపర్, గన్ పౌడర్ తయారుచేశారు. వాటిని ప్రపంచమంతా కొనాల్సి వచ్చింది. ఆ రూట్ చంఘిజ్ ఖాన్ ఎంపైర్ చేతిలో ఉండేది. వాళ్లే దౌర్జన్యం చేసేవారు. మార్కో పోలో ఈ రూట్‌ను ఉపయోగించుకుంటూ పేపర్, బొగ్గు అమ్మడం ప్రారంభించారు".

"ఈ రూట్ మధ్యలో దోపిడీ దొంగలు దాడి చేసేవారు. వాళ్ల నుంచి తప్పించుకోవడానికి అందరూ వెయ్యి ఒంటెలతో ప్రయాణించేవారు. ఈ రూట్‌లో వ్యాపారం చేయాలంటే కత్తి పట్టుకొని బయల్దేరాలి. 1500 సంవత్సరాల పాటు ప్రపంచమంతా ఈ దారినే వాడింది. ఈ రూట్‌లో బిజినెస్ చేయడానికి అందరూ ఒక ప్రత్యేక భాష ఉపయోగించేవారు. దాని పేరు మాలి. ఆ తర్వాత సముద్రమార్గం కనిపెట్టడం వల్ల ఈ సిల్క్ రోడ్డు ప్రయాణాన్ని తగ్గించేశారు. వరల్డ్ గ్లోబలైజేషన్‌కు మొదటి కారణం ఈ సిల్క్ రూటే. సంస్కృతి, టెక్నాలజీ, మతాలు ఇలా ఎన్నో అంశాలు అందరూ ఎక్స్‌ఛేంజ్ చేసుకునేవారు. ఇప్పటికీ కొంతమంది ట్రావెలర్స్ ఈ సిల్క్ రోడ్‌లో ప్రయాణం చేస్తున్నారు" అని పూరి వివరించారు.

## చిరంజీవితో సినిమా.. భారీగా డిమాండ్ చేస్తోన్న స్టార్ హీరోయిన్!



సినీ పరిశ్రమలో ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్న హీరోయిన్లే ఎక్కువ. కానీ ఈ రోజుల్లో దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఎంట్రీ ఇచ్చి ఎండింగే లేదంటున్న హీరోయిన్లు ఉండడం విశేషమే. అలాంటి అతి తక్కువ మంది కథానాయికల్లో నయనతార ఒకరు. వరుసగా విజయాలతో దూసుకుపోతున్న హీరోయిన్‌కు ఒకటి రెండు ఫ్లాప్‌లు ఎదురైతే కేరీర్ తలకిందులవుతుంది. అలాంటిది నయనతార మంచి విజయాన్ని చూసి చాలా కాలమే అయింది.

ఆ మధ్య ఈమె నటించిన ఉమెన్ సెంట్రిక్ కథా చిత్రం అన్నపూరిణి నిరాశ పరిచింది. ఇటీవల కథానాయకిగా నటించిన టెస్ట్ చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను అలరించలేక పోయింది. మరో పక్క పెళ్లి, భర్త, ఇద్దరు కవల పిల్లలు అంటూ సంసార జీవితం. అయినా అవకాశాలు మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం చేతిలో నాలుగైదు చిత్రాలు ఉన్నాయి. అయితే ఈమె తొలి సారిగా బాలీవుడ్‌లో షారుఖ్‌ఖాన్‌తో జంటగా నటించిన జవాన్ చిత్రం సంచలన విజయాన్ని సాధించింది. అంతే కాకుండా ఆ చిత్రానికి రూ.12 కోట్లు వరకూ పారితోషికం తీసుకున్నట్లు సమాచారం.

## ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి

### సిఐటియు నాయకులు సాగిన చిరంజీవి డిమాండ్



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, అదే క్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా గుర్తించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు గళం విప్పారు. సిఐటియు నాయకుడు సాగిన చిరంజీవి ఆధ్వర్యంలో మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పని చేస్తున్న ఆశా కార్యకర్తలతో తమ న్యాయమైన కోరికలు తీర్చాలంటూ ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ శివప్రసాద్ కి ఆశా కార్యకర్తలతో కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి 26 వేల రూపాయలు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా గుర్తించాలని, ఒప్పంద జీవోలను విడుదల చేయాలని,. నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని,. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్న డిమాండ్స్ సాధనకై కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు ఈనెల 20 న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు అందరు భాగస్వాములు కావాలన్నారు.

కార్మికులను, యజమానులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని. ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షించాలని, ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని ఒప్పంద జీఓ లను విడుదల చేయాలని, చట్ట పరమైన సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని గత 20 ఏళ్ళుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నా, ప్రభుత్వం వీరి సేవలను గుర్తించి కార్మికులుగా గుర్తించాలని ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ నియామకాలు ప్రభుత్వము చేపట్టాలని, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు అనారోగ్యంతో ఆశా కార్యకర్తలు మరణిస్తే ప్రభుత్వం గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఏజెన్సీలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశ వర్కర్లుగా గుర్తించాలన్న డిమాండ్లతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఈనెల 20న జరుగుతున్న దేశవ్యాప్తంగా సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొవాలని యూనియన్ కమిటీ నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆశా కార్యకర్తలందరూ ఈనెల 20న జరిగే సమ్మెలో పాల్గొని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆ పీహెచ్సీ వైద్యాధికారి శివప్రసాద్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆశా కార్యకర్తలతో కలసి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు. మజ్జి రాంబాబు. ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, రవణమ్మ, స్రవంతి, అధిక సంఖ్యలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com